ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 02 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 117
Sunday 02 August 2026 | Vol.No 28 Issue No .117
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి

- తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్1 : తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో

మిగతా 2లో..

## పెట్టుబడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

- ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన



హైదరాబాద్,ఆగస్ట్1 : తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు

మిగతా 2లో..

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం



- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
- భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల
- త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్1 : ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో

మిగతా 2లో..

## ఉత్తర తెలంగాణకు సాగునీరు లక్ష్యం!!

- కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులే రైతులకు అండ
- 340 లక్షల టన్నుల ధాన్య ఉత్పత్తి
- రైతులకు రూ.80 వేల కోట్ల చెల్లింపులు
- కాళేశ్వరం బ్యారేజీలపై మంత్రుల విమర్శలు
- కేసీఆర్ రూ.1.81 లక్షల కోట్లపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేరు
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు1(విజన్ ఆంధ్ర):ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు జవహర్‌లాల్ నెహ్రూ, 1959లో కడెం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపనలు జరిగాయని, 2004 జూలై 28న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఎల్లంపల్లి మెజారిటీ పనులు కాంగ్రెస్ పాలనలోనే పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టుకు దివంగత శ్రీపాదరావు పేరు పెట్టడమే కాకుండా, ఇది నాటి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండేదని వివరించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) స్పష్టంగా లిఖితపూర్వకంగా సూచించిందని, సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్ఏ అధికారులతో జరిగిన సాంకేతిక సమావేశంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని తేల్చారన్నారు. డీపీఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ వేయాల్సి ఉన్నప్పటికీ స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించడం వల్లే నాణ్యత లోపించిందని నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు.

మిగతా 2లో..

## డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

- వ్యవసాయ మార్కెట్లలో పూర్తి డిజిటలీకరణ.., • మార్కెట్ కమిటీల ఆటోమేషన్‌కు ఆదేశాలు..
- కొనుగోళ్లు, లావాదేవీలన్నీ డిజిటల్ విధానంలోనే, • సౌర విద్యుత్ వ్యవస్థలు, పత్తి కొనుగోళ్ల
- కోహెడ పండ్ల మార్కెట్ పనులు వేగవంతం చేయాలి, • అధికారులకు మంత్రి తుమ్మల సూచనలు



మిగతా 2లో..

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

- ఎన్నో వార్తలను వాటిద్వారానే వెలుగు చూస్తున్నాయి
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్,ఆగస్ట్1 : యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని

మిగతా 2లో..

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

- నీళ్లు మళ్లించే ఏపి కుట్రలు వేగమయ్యాయి
- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ




హైదరాబాద్,ఆగస్ట్1 : గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని

మిగతా 2లో..

## ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయ్

- హేళన చేసిన వారు అడ్రస్ లేకుండా పోయారు
- కష్టాల్లో ఉన్న ఏపిని ఆదుకున్న ప్రధాని మోడీ
- పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును కాపాడిన ప్రధాని
- ఉత్తరాంధ్ర దిశ మారబోతోందని చంద్రబాబు వెల్లడి



విజయనగరం,ఆగస్ట్1 : భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ

మిగతా 2లో..

## ఎర్రబస్సు కాదు.. ఎయిర్ బస్సులు వాలుతాయ్

- కళ్లు తెరచి చూస్తే అభివృద్ధి కనిపిస్తుంది
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్
- ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చారన్న లోకేశ్



విజయనగరం,ఆగస్ట్1 :ప్రపంచం మొత్తం ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ... యువతకు ఉద్యోగావకాశాలు పెరగబోతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ సింహద్వారమని చెప్పుకొచ్చారు. ఏపీ

మిగతా 2లో..

## భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే





- స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి కీలకమైన రోజు, • నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి, • చంద్రబాబు విజన్‌తో ఏపి అభివృద్ధిలో పరుగెడుతోంది
- 12 ఏళ్లలో దేశంలో కొత్తగా 166 విమానాశ్రయాలు నిర్మించాం, • విమానం ఎక్కాలన్న పేదల కల సాకారం చేస్తున్నాం, • భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించిన మోడీ
- పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం

విజయనగరం,ఆగస్ట్1 : స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి నేడు కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రూ.18 వేల కోట్లతో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన

మిగతా 2లో..

## దేశాన్ని వికసిత్ భారత్‌గా నడిపిస్తున్న మోడీ

- భారత్ ప్రగతిపథంలో పయనించడానికి అహర్నిశలు శ్రమ
- చంద్రబాబు మార్గదర్శకత్వంలో అగ్రగామిగా ఆంధ్రా
- భోగాపురం సభలో పవన్ కళ్యాణ్



విజయనగరం,ఆగస్ట్1 : 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన

మిగతా 2లో..

## కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి

నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెట్టుబుడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

## ఉత్తర తెలంగాణకు సాగునీరు లక్ష్యం!!

గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు చేస్తున్ అసత్య ప్రచారాలను ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వం మరియు అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు బ్యారేజీల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వరద పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా అనేక ప్రాజెక్టులు పూర్తికాలేదని ఆరోపించారు. గడచిన 34 నెలలుగా కాళేశ్వరం బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోయకపోయినా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానూ నీరందించి, 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లించామని వివరించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఎస్‌పి, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని, కాళేశ్వరం బ్యారేజీల్లో నీటి నిల్వకు ఎన్‌డీఎస్‌ఏ అనుమతించకపోవడం వల్లే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించామని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు నీటి తరలింపు, ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాల కృషియేనని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వ నాసిరకం నిర్మాణాలు, తుగ్లక్ నిర్ణయాల వల్లే నీటిపారుదల రంగంలో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని ధ్వజమెత్తారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

కేటీఆర్ అన్నారు.తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## ఎర్రబస్సు కాదు..ఎయిర్ బస్సులు వాలుతాయ్

అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం మారనుందని తెలిపారు. ఎర్రబస్సు కూడా తిరగని ప్రాంతమని కొందరు హేళన చేశారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్‌బస్సు తిరిగే ప్రాంతమైంది' అని తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతి ఇంటి పండుగ ఇది అని అన్నారు. మన్యం వీరుడు అల్లూరి పేరు ప్రపంచం మొత్తం మార్మోగుతోందని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ప్రధాని మోదీది అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047, ప్రధాని మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం అని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెక్కలిచ్చారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి నడిచిన ప్రాంతం.. ఉత్తరాంధ్ర. ఈ విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకం కాబోతోంది. ఏపీ అభివృద్ధికి మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారు. నమో సహకారంతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సహజవనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్ర. ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గుతాయి. ఎర్రబస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది.. మన ప్రధాని మోదీ వచ్చారు. శరవేగంగా విమానాశ్రయం నిర్మించిన జీఎంఆర్‌కు అభినందనలు' అని లోకేశ్ తెలిపారు.

## దేశాన్ని వికసిత్ భారత్‌గా నడిపిస్తున్న మోడీ

బహిరంగ సభలో మాట్లాడుతూ.. భారత్‌ను ప్రగతి పథంలో వేగంగా నడిపిస్తున్న నేత ప్రధాని మోదీ అని తెలిపారు. దేశాన్ని మోదీ వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న నేత మోదీ అని కొనియాడారు. తనను దూషించినవారిని కూడా క్షమించే గుణం మోదీది అని చెప్పుకొచ్చారు. తెలుగుజాతి ఎవరికీ తలవంచదని అల్లూరి గర్జించారని డిప్యూటీ సీఎం అన్నారు. చంద్రబాబు మార్గదర్శకత్వంలో అగ్రగామిగా ఏపీ మారుతోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ సరికొత్త అధ్యాయమని వెల్లడించారు. దేశ ప్రగతికి మౌలిక వసతుల కల్పనే కీలకమని ప్రధాని మోదీకి తెలుసన్నారు. రైల్వే జోన్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దేశ ప్రగతికి మౌలిక వసతుల కల్పనే కీలకమని ప్రధానికి తెలుసు. అందుకే.. రైల్వే జోన్ ఇచ్చి ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న ప్రధానికి చాలా అవమానాలు ఎదురయ్యాయి. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో ఆలోచించాలి. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ప్రధానిని విమర్శిస్తుంటే చాలా బాధపడ్డా. ఎన్ని బాధలు పడ్డా.. వెనక్కి లాగుతున్నా.. మోదీ ఎక్కడా భయపడలేదు. కాయలు కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగలడం సహజం. తనను దూషించే వారిని కూడా క్షమించే గుణం మోదీది. సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న ప్రధానికి మనం ఏం ఇవ్వగలం. దేశానికి ఇలాంటి ప్రధాని రావడం మనందరి అదృష్టం' అని పవన్ అన్నారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో పాటు పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. 'ఈ నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయన్నారు. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు చేస్తున్నా. 13 వేల మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి 13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా పనిచేస్తుంది. ఈ ఎయిర్‌పోర్టు.. ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తు?న్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి.దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావంతులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి' అని మోదీ తెలిపారు. అనంతరం పలు ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.4,727 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. విశాఖపట్నం తర్లువాడలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్ తొలిదశకు శ్రీకారం చుట్టారు. రూ.468 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ ప్రాజెక్టును ప్రారంభించారు. కర్నూలు జిల్లాలో 4 రెన్యువబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.5,550 కోట్ల వ్యయంతో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ప్రారంభించారు. రూ.3,547 కోట్ల వ్యయంతో కర్నూలు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలులో రూ.823 కోట్ల వ్యయంతో.. చేపట్టిన సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకం ప్రారంభించారు. రూ.27 కోట్లతో పెంచలకోన-ఎర్రపాడు హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.763 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-4, రూ.933 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-5 ప్రారంభించారు. రూ.160 కోట్లతో తాడిపత్రి 4 లేన్ బైపాస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయ్

ఆక్సిజన్ ఇచ్చారని కొనియాడారు. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి ప్రధాని అండగా నిలిచారని ఉద్ఘాటించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును మోదీ కాపాడారని ప్రశంసించారు. ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఏపీని పునర్‌నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. చేస్తున్నామని స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొని సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదని కొందరు హేళన చేశారని సీఎం విమర్శించారు. అవహేళన చేసినవారు అడ్రస్ లేకుండా పోయారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్రకు నాంది పలికామని ఉద్ఘాటించారు. గూగుల్, స్టీల్ కంపెనీలతోపాటు చాలా సంస్థలు వచ్చాయని వివరించారు. ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయని వెల్లడించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయని వివరించారు. ఉత్తరాంధ్రలో అన్నిరకాల వనరులు ఉన్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ఇక్కడికే ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చేలా చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశాన్ని మోదీ 12 ఏళ్లుగా సమర్థంగా నడిపిస్తున్నారని సీఎం కొనియాడారు. దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చే ఘనత మోదీదేనని ప్రశంసల వర్షం కురిపించారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారని తెలిపారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం లేకుండా చేశారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉందని వెల్లడించారు. మోదీ లాంటి నేతను తన రాజకీయ జీవితంలోనే చూడలేదని అన్నారు. నేషన్ ఫస్ట్ అనే ప్రధానిని తొలిసారి చూస్తున్నామని చెప్పారు. 2047లోగా ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా భారత్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనం ఈ ఎయిర్‌పోర్టు. భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నా. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టు నిర్మించారు. తొలి అడుగు వేసిన అశోక్‌గజపతిరాజు, నిర్మాణం పూర్తిచేసే బాధ్యత తీసుకున్న రామ్మోహన్ ఇక్కడి వారే. భోగాపురం ఎయిర్‌పోర్టుకు నాడు కొబ్బరికాయ కొట్టింది మనమే.. నేడు గుమ్మడికాయ కొట్టింది మనమే. ఈ విమానాశ్రయంతో ఈ ప్రాంతం దశ, దిశ మారతాయి. ఉత్తరాంధ్రకు గూగుల్, స్టీల్ కంపెనీతో పాటు చాలా సంస్థలు వచ్చాయి. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ఇన చూశాం. కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన వ్యక్తి మోదీ. పోలవరం, రైల్వే జోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోదీ. ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయి. రూ.2,784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి అండగా నిలబడ్డారు. 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ప్రధాని మోదీ .. 12 ఏళ్లుగా దేశాన్ని సమర్థంగా నడిపిస్తున్నారు. ఈ దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. పరిపాలనలో అవినీతి ఆరోపణలు లేకుండా ముందుకెళ్తున్నారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం లేకుండా అరికట్టారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉంటోంది. ఇలాంటి నేతలను నా రాజకీయ జీవితంలో చూడలేదు. ప్రతి విషయంలో నేషన్ ఫస్ట్ .. అనే ప్రధానిని తొలిసారి చూస్తున్నా. భారత్.. 2047లోగా ప్రపంచంలోనే నంబర్ వన్‌గా మారుతుందని సీఎం అన్నారు.

## డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

హైదరాబాద్,ఆగస్ట్1 :రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖను పూర్తిస్థాయిలో డిజిటలీకరించి పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, మార్కెట్ యార్డుల అభివృద్ధిపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు. ప్రతి మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ,ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ఎ÷-లాట్‌ఫారంపై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లోనూ అమలు చేసి, వాహనాల ప్రవేశం, నిష్క్రమణ, తూకం, కొనుగోలు లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదు అయ్యేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఇకపై మార్కెటింగ్ శాఖలో జరిగే అన్ని కొనుగోళ్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. రానున్న పత్తి కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సన్నద్ధత అవసరమని మంత్రి పేర్కొన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు తొలి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. గతంలో గుర్తించిన లోపాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రయోజనం పూర్తిగా రైతులకే అందేలా చూడాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వచ్చే నెలలోగా ఫీజిబిలిటీ నివేదికలు సేకరించి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి నవంబర్ నాటికి అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులకు స్పష్టమైన గడువులు నిర్ణయించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే పనులను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు అప్పగించి వేగవంతం చేయాలని సూచించారు. కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ డిజైన్లను వచ్చే వారంలో ఖరారు చేసి, ముఖ్యమంత్రి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెటింగ్ శాఖలో ఇంజినీరింగ్, పరిపాలన విభాగాల్లో ఉన్న సిబ్బంది కొరతను గుర్తించి అదనపు పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కు మంత్రి ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని నియమించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతు సంఘాల ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పలు సమస్యలను వివరించారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడం, ప్రతి మండలంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రం ఏర్పాటు, బ్యాంకు రుణాలు, యంత్ర పరికరాలపై సబ్సిడీ, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన మంత్రి, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూల ప్రాంతమని, ఈ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలు అందేలా కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు.

కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమ్నే ÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత

ముంబై,ఆగస్ట్1 : ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లోద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

# సంపాదకీయం

## ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలిసి వచ్చే అంశం. రోడ్డు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఏపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోదీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేటేవేను తెరిచారు. అమరావతి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలిసి వచ్చే అంశం. విశాఖ పూర్తిస్థాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఏపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్ల కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఏలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుకుంది. ఇలా చరిత్రలో 2026 జనవరి 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్ట్! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచన సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్థితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక అభివృద్ధికి ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ావడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

## పసుపు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మాతా నిమిషాంబికా దేవి

### ఆషాఢమాసం మూడవ శుక్రవారం ప్రత్యేక పూజలు

### భారీగా తరలివచ్చిన భక్తులు



బోడుప్పల్, జూలై 31 (విజన్ ఆంధ్ర):బోడుప్పల్ సర్కిల్ లోని శ్రీ మాతా నిమిషాంబికా దేవి ఆలయంలో ఆషాఢమాసం మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, పసుపుతో అత్యంత వైభవంగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ మాతా నిమిషాంబికా దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో, శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం (హంపీ పీఠం) సంచాలనలో శ్రీ మాతా నిమిషాంబికా దేవి పసుపు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.సౌభాగ్యప్రదాయిని, సర్వమంగళ శక్తి స్వరూపిణిగా కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దివ్య దర్శనం వల్ల భక్తుల సకల మనోభీష్టాలు నెరవేరి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, ఎం. శ్రీనివాస్ రావు, ఎం. సాయిబాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్. రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామకృష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావుతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మ పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## కీర్తన అనాధ ఆశ్రమానికి నాగార్జున స్కూల్ విద్యార్థుల వితరణ



ఎల్బీనగర్ (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం సాగర్ రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటెస్సోరీ, ఐ. ఐ. టి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం కీర్తన అనాధ ఆశ్రమానికి ఆరు క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు విరాళంగా అంద చేశారు. నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలలో ఛారిటీ డే నిర్వహించారు. విద్యార్థుల నుంచి సేకరించిన సరకులకు తోడు యాజమాన్యం మరి కొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా అంద చేశారు.ఈ సందర్భంగా నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని అన్నారు. చిన్నారుల్లో సేవా భావం పెంపొందించడానికి తమ పాఠశాలల్లో ఏడాదిలో ఒక రోజు ఛారిటీ డే నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్నారులకు సమాజం పట్ల అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కల్గిన పౌరులుగా తీర్చిదిద్దాలని విఠల్ రెడ్డి సూచించారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల వైస్ ఛైర్ పర్సన్ జి. రజని విఠల్ రెడ్డి, సీ. ఏ. ఓ ఏ. శేషా రావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజ శేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ మహేష్, ఇన్చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు రహిత సమాజంలో యువత భాగస్వామ్యం కావాలి

### జిల్లా యువజన అధికారి వి.కోట నాయక్



గద్వాల ఆగస్టు 01( విజన్ ఆంధ్ర బ్యూరో)డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా యువజన అధికారి వి.కోట నాయక్ అన్నారు.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో,నశా ముక్త్ భారత్ అభియాన "మేరా యువ భారత్ సంయుక్తంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఎంఏఎల్డీ డిగ్రీ & పీజీ కళాశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ,"నశా ముక్త్ భారత్ అభియాన్" లక్ష్యం మత్తు రహిత సమాజ నిర్మాణమేనని అన్నారు.దేశ భవిష్యత్తు అయిన యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. మత్తు వ్యసనాలు వ్యక్తి, కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. యువత తమ లక్ష్యాల సాధనకు కృషి చేస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో 'నశా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు. యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు నుక్కడ్ నాటకం, పాటలు,వ్యాసరచన,పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా,జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శివకృష్ణ,కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ పాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాస్కర్,అధ్యాపకులు సురేందర్ రెడ్డి,డా.కర్ణాకర్,వివిధ కళాశాలల అధ్యాపకులు,యువత,విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

## పిల్లల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

### జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి



గద్వాల ఆగస్టు 01( విజన్ ఆంధ్ర బ్యూరో)పిల్లల హక్కుల పరిరక్షణ, భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి అన్నారు.జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నాల్స పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం2024" పై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల కోసం శనివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం 2024 ద్వారా ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం,పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవలు అందించడం అన్నారు.అలాగే వారికి చట్టాలపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్, రక్షణ,పునరావాసం అందించడమే లక్ష్యమన్నారు.పిల్లల గోప్యత, గౌరవం,భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ,సంబంధిత శాఖల సమన్వయంతో వారి శ్రేయస్సు కోసం ఈ పథకం పనిచేస్తుందని వివరించారు.పోక్సో చట్టం " 2012లో మొత్తం 46 సెక్షన్లు ఉన్నాయని,ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ పిల్లలుగా పరిగణించబడతారని తెలిపారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడం,బాధితులకు న్యాయ పరిరక్షణ కల్పించడం,నేరస్థులకు కఠిన శిక్షలు విధించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తే ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, వేధింపులు లేదా హింసకు గురవుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థి భద్రత,సంక్షేమంపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు.పిల్లలపై జరిగే వేధింపులు,బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతి చిన్నారికి సురక్షితమైన, వివక్షలేని వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం " 2024,పోక్సో చట్టం,బాలల హక్కులు,బాల్య వివాహాల నివారణ,బాల కార్మిక నిర్మూలన, పిల్లల రక్షణపై అవగాహన కల్పించే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వి.శ్రీనివాస్,జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ.నాగరాజు,జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీఓ ఆకాశ దీప్తి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## రూ.8 వేలకోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### -ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం: గుజ్జ సత్యం హెచ్చరిక



ఎల్బీనగర్ (విజన్ ఆంధ్ర): పోరాడి సాధించుకున్నటువంటి తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల యొక్క విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు గుజ్జ సత్యం అధ్యక్షతన కొత్తపేట శివాని కళాశాల వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్తపేట చౌరస్తాలో ఆందోళన, నిరసన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగబద్ధమైన విద్యా అవకాశాలను కల్పించే సామాజిక న్యాయ పథకమని స్పష్టం చేశారు. వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకంపై ఆధారపడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికే కళాశాలలకు వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో అనేక విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, మరోవైపు విద్యార్థులు ఫీజుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను హక్కుగా గుర్తించిన ప్రభుత్వం, అదే హక్కు అమలులో మాత్రం వెనుకడుగు వేయడం విరుద్ధమైన వైఖరని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన చర్యలు విద్యార్థుల్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించలేకపోయాయని, పూర్తి స్థాయిలో పెండింగ్ బకాయిల విడుదలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన విద్యార్థుల మహా ర్యాలీలు, కలెక్టరేట్ ఆర్డీవో ఎంఆర్ఓ కార్యాలయాల వరకు చేపట్టిన ప్రదర్శనలు విజయవంతంగా జరిగాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, బీసీ జాక్ స్టేట్ కో-ఆర్డినేటర్ గుజ్జ సత్యం తెలిపారు. విద్యార్థుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని, సమస్యను రాజకీయ కోణంలో కాకుండా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం,14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టొద్దని, విద్యార్థులపై ఆర్థిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకోవడం వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం కొనసాగుతుందని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. అనంతరం మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ.. "విద్యపై పెట్టుబడి పెట్టడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యతని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల పేద విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడుతోందన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుపై నమ్మకాన్ని పునరుద్ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురాంనేత, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ కర్నాటి ధనంజయ, సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థాపకులు చామకూర రాజు, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్, బీసీ నాయకులు బ్రహ్మయ్య, విద్యార్థి నాయకులు గుర్రం శ్రవణ్, లక్ష్మీనారాయణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

## భక్తుల సౌకర్యమే ధ్యేయంగా లచ్చపేట మహంకాళి ఆలయం వద్ద హామీని నెరవేర్చిన దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక విజన్ ఆంధ్ర దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటలో మహంకాళి అమ్మవారి దేవాలయ బోనాల ఉత్సవంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరంలో ఇచ్చిన మాట ప్రకారం ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డును నిర్మించడం జరిగిందని తెలిపారులిమహంకాళి అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారుఈ కార్యక్రమంలో దుబ్బాక పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారులి..

## ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

### గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్1: తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఈ యేడు తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు

### సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వరుసగా నిర్వహణ

తిరుమల,ఆగస్ట్1: తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటుంది

# క్రీడాకారులు నైపుణ్యాలతో లక్ష్యాలను చేరుకోవాలి

**-జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





గద్వాల ఆగస్టు 01( విజన్ ఆంధ్ర బ్యూరో) : క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం గద్వాల మండలం వీరాపూర్ గ్రామంలోని ఎస్ఆర్ విద్యానికేతన్ లో జూలై 29న ప్రారంభమైన సీబీఎస్ఈ సౌత్ క్లస్టర్ (7వ) బాలుర వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ టోర్నమెంటులో పెద్ద ఎత్తున పాల్గొన్నప్పటికీ నిర్వాహకులు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి క్రీడలను విజయవంతం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి, విజేతలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ విభాగాల వారీగా విజేతలు, రన్నర్స్ కు కలెక్టర్ పతకాలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ పాఠశాలల పరిశీలకులు శేషు, డైరెక్టర్ రాముడు, ప్రిన్సిపల్ గోన సునీత, ఇతర ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ

## కార్పొరేటర్ బొట్ల అనిత సత్యం




మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,(విజన్ ఆంధ్ర)తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ అని గోసేవ మండల్ డివిజన్ కార్పొరేటర్ బొట్ల అనిత అన్నారు. శనివారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని గో సేవ మండల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఐ.కె.పి. ఆర్.పి. నజ్రీన్, వార్డు అధికారి సౌమ్య లతో కలిసి హాజరై అర్హులైన లబ్ధిదారులకు బాలామృతం, బాలామతం ప్లస్, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు జననం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి 6 నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి తల్లి తన బిడ్డకు అందించాలని, ఆ తర్వాత రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగిస్తూనే వయస్సుకు తగిన అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో అవసరమని, తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి తల్లి అవగాహనతో ముందుకు రావాలని అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం, బాలామృతం ప్లస్, కోడిగుడ్లు, పోషకాహార సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను వినియోగించుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న మాతా-శిశు సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, పరిశుభ్రత, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# త్రాగునీటిని పొదుపుగా వినియోగించండి

**నగర ప్రజలకు కేఎంసి ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విజ్ఞప్తి**



కడప,ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర) పెన్నా నదిలో అడుగంటిన నీటి స్థాయిలు. కడప నగరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని. ఈ పరిస్థితులను అధిగమించేందుకు నగర ప్రజలందరూ త్రాగునీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని కడప నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారులు జూలై 31న మైలవరం జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని పెన్నా నదిలోకి విడుదల చేసినప్పటికీ, ఆ నీరు కడప నగరానికి చేరుకోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల అప్పటి వరకు త్రాగునీటి వినియోగంలో ప్రజలు మితంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితిలో కూడా నగరంలో రోజు మార్చి రోజు యథావిధిగా త్రాగునీటి సరఫరా కొనసాగుతుందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సరఫరా సమయాన్ని తగ్గిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి యజమాని అవసరమైన మేరకే నీటిని వినియోగించి, వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటితో వాహనాలు కడగడం,ఇళ్ల ప్రాంగణాలను శుభ్రం చేయడం, తోటలకు వృథాగా పోయడం వంటి అవసరంలేని వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రతి కుటుంబం నీటిని పొదుపుగా వినియోగిస్తే నగరంలోని చివరి ప్రాంతాల వరకు త్రాగునీరు సమానంగా అందే అవకాశం ఉంటుందన్నారు. సామాజిక బాధ్యతతో నీటిని సంరక్షించి అందరికీ త్రాగునీరు అందేలా సహకరించాలని నగర ప్రజలకు కేఎంసి ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# పెట్టుబడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

## ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన

హైదరాబాద్,ఆగస్ట్1 తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఓషన్ బ్రీజ్, రూబీ మిస్ట్ వేరియంట్ల విడుదల

హైదరాబాద్, ఆగస్ట్ 01 (విజన్ ఆంధ్ర): డాబర్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఎయిర్ ఫ్రెష్నర్ బ్రాండ్ ఓడోనిల్ కార్ ఫ్రాగ్రన్స్ విభాగంలోకి ప్రవేశిస్తూ ఓషన్ బ్రీజ్, రూబీ మిస్ట్ వేరియంట్లను విడుదల చేసినట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ హోం కేర్ మార్కెటింగ్ హెడ్ వైభవ్ రాథీ శనివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 45 రోజుల వరకు నిలిచే సువాసన, ఫ్రాగ్రన్స్ రెగ్యులేటర్, యాంటీ స్మోక్ టెక్నాలజీ వంటి ఫీచర్లతో ఈ ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 8 మిల్లీలీటర్ల సింగిల్ ప్యాక్ ధర రూ.99 కాగా, సింగిల్, వ్యాల్యూ ప్యాక్‌లలో ఈ ఉత్పత్తులు ప్రముఖ ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మోడ్రన్ ట్రేడ్ అవుట్‌లెట్లు, రిటైల్ స్టోర్లలో లభ్యమవుతాయని వెల్లడించారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి పునాదిలి: లిజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 1(విజన్ ఆంధ్ర) :ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2026 సందర్భంగా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని అన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంతో పాటు అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అనంతరం వయస్సుకు తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలోని ప్రతి కుటుంబానికి విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ తల్లిపాలను ప్రోత్సహించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో తల్లిపాలు అత్యంత కీలకమైనవని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు. తల్లి పాలు శిశువుకు సరిపోను పట్టిన తర్వాత ఎక్కువగా ఉంటే వృథా చేయకుండా "సుషేనా ఫౌండేషన్, దాత్రి మిల్క్ బ్యాంకు కు డొనేట్ చెయ్యాలని, ఇట్టి తల్లి పాలు తాగించే అవకాశము లేని శిశువులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులు, నినాదాలతో సాగిన ర్యాలీలో తల్లులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓలా, ఉబర్, రాపిడో లను రద్దు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేరిపోతుల కుమార్**

జనగామ,ఆగస్టు01(విజన్ ఆంధ్ర):తెలంగాణ రాష్ట్రంలో ఓలా, ఉబర్, రాపిడో లను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేరిపోతుల కుమార్ అన్నారు. శనివారంజనగామ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో జనగామ జిల్లా అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేరిపోతుల కుమార్ ఆటో డ్రైవర్ల జెండా ఆవిష్కరించడం జరిగిందిఅనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెట్టిన మేనిఫెస్టో ప్రకారం సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా ఎంతోమంది ఆటో డ్రైవర్లు ఫైనాన్స్ లు కట్టలేక కుటుంబాన్ని పోసించలేక ఆత్మహత్య చేసుకున్నారు అని మానసికంగా కృంగిపోయి చనిపోయిన కుటుంబాలకు 25 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియ ఇవ్వాలన్నారు. 90% సబ్సిడీతో అర్హులైన డ్రైవవర్లశీదరికీ వాహనాలు ఇవ్వాలని కోరారు. టీజీఎస్ ఆర్టీసీ లో ఈవి ఆటోలలో ప్రస్తుతం రవాణా రంగంపై ఆధారపడ్డ డ్రైవర్లకు అవకాశాలు కల్పించాలనిజనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్దే శ్రీశైలం, నల్ల మల్లయ్య, అడ్డూరి శ్రీనివాస్, ఎడ్ల ఎల్లయ్య, నోముల శ్రీను, మంగ శీను, చీర కుమార్, బీదాని మల్లేష్, కొల్లూరి భాస్కర్,చుంచు రాజు, ఎండి సికిందర్, చాట్ల మధు, బండి భాస్కర్, మరియు అన్ని అడ్డాల డ్రైవర్లు పాల్గొన్నారు.

## చెంగిచెర్ల డివిజన్ సమస్యలపై బీజేపీ సమరశంఖం

**వక్ఫ్ బోర్డు, మేకలమండి,రోడ్లు,మంచినీటి సమస్యలపై కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు**

బోడుప్పల్,ఆగస్ట్ 01(విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు ఎర్పుల మహేష్ ఆధ్వర్యంలో శనివారం బోడుప్పల్ సర్కిల్ లో డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జి శోభారెడ్డి ,యువమోర్చా రాష్ట్ర నాయకులు సామల పవన్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బజారు కిరణ్ గౌడ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెంగిచెర్ల డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలైన వక్ఫ్ బోర్డు, మేకలమండి,డివిజన్‌లో రోడ్ల దుస్థితి, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏనుగు లక్ష్మయ్య, రాసాల నర్సింగ్ రావు, కూరపాటి విజయ్ కుమార్, పద్మారెడ్డి, కరుణాకర్, ఎస్.ఎం. ప్రగతి,డివిజన్ నాయకులు గండిపల్లి రాజు, కిషోర్ నాయుడు, బజ్జురి శ్రీనివాస్, రాజిరెడ్డి, కాంతారెడ్డి, విజయరెడ్డి, హరిపురం నవీన్, భారత్ పటేల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అటానమస్ గుర్తింపు పొందిన బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల

బద్వేలు, ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర) బద్వేలు నియోజక వర్గానికి తలమానికమైన శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి ( అటానమస్) గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపల్ డా,, కే వెంకటసుబ్బారెడ్డి తెలిపారు ఈ కళాశాల నియోజకవర్గం వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య కలలను సాకారం చేసి నేడు బద్వేలు పట్టణానికి తలమానికమై ఉన్నదన్నారు డిగ్రీ కళాశాల 1979 వ సంవత్సరంలో స్థాపించి విభిన్న కోర్సులతో వేలాది మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించి జాతీయస్థాయిలో చీూాజ నాక్ అక్రిడి యేసన్ గుర్తింపు ఉంది నేడు యు జి సి ద్వారా స్వయం ప్రతిపత్తి హోదా సాధించడం ఎంతో గర్వకారణం అని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యార్థులకు మంచి సదవకాశమని ఆయన తెలిపారు యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలలో ఎన్నోసార్లు ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి కడప జిల్లాలో నెంబర్ వన్ విద్యాసంస్థగా గుర్తింపు పొందిందన్నారు శ్రీ బిజివేముల వేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు అటానమస్ స్వయం ప్రతిపత్తి హోదా లభించినందుకు విద్యాసంస్థల కరస్పాండెంట్ కే. విజయమ్మ, కళాశాల సెక్రటరీ కె. రితీష్ కుమార్ రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని వీరు అభినందించారు డిగ్రీ కళాశాలలో బి ఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ కోర్సులలో జాయిన్ కావదలచిన వారు అడ్మిషన్ల కొరకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా ప్రిన్సిపల్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు

# ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషించాలి

**ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1:(విజన్ అంధ్ర) కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ మరియు మంచిర్యాల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఐదు రోజుల విషయాల వారీ శిక్షణ కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పఠనం, రచన, గణిత నైపుణ్యాలతో పాటు ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించేలా బోధన సాగించాలని, ప్రతి విద్యార్థి అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా ప్రమాణాల పెంపునకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ,డిప్యూటీ డి ఇ ఓ గోడం చందన్,పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్క ఉద్ధవ్, మంచిర్యాల ఏ సి ఏం ఓ లక్ష్మయ్య,జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, కోర్సు డైరెక్టర్ కోడెం రవీందర్, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, శిక్షణ సమన్వయకర్తలు మరియు వివిధ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో శిక్షణ విజయవంతంగా నిర్వహించిన అధికారులకు, రిసోర్స్ పర్సన్లకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

**తెలంగాణ ప్రభుత్వము**
**స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వారి కార్యాలయము**
**(భూసేకరణ)**
**జోగులాంబ గద్వాల జిల్లా**

## ఫారం - VII

**రూఢి ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)**
**(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి**

జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసిడింగ్స్ నెం.జి/372/2025 తేది:09-06-2025
ప్రత్యేక ఉప కలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఐ.పి. లేఖ నెం.ఎ2/98/2017 తేది:02-06-2026
జిల్లా రాజ పత్రం నెం. 23/2026

ఈ దిగువ నిర్దిష్టపరిచిన జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ.4.25 సెం.లు ప్రజా ప్రయోజనం నిమిత్తము అనగా ప్యాకేజి నెం. 99(బి) డి-15 కెనాల్ నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.

కావున జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ.4.25 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

| క్ర. సం. | సర్వే నెం. | భూమి విధం (పట్టా/ ప్రభుత్వ ఇనాం మొ.) | భూ రకం (మెట్ట/ తరి మొ.) | భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.సెం.లు | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | చెట్ల రకం/ సంఖ్య కట్టడం రకం/ విస్తీర్ణము చ.గజాలలో |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 11 | పట్టా | మెట్ట | 0.425 | 1. యరుకలి జమ్మన్న తండ్రి చిన్న బుడ్డన్న<br>2.సుంకన్న తండ్రి హనుమన్న<br>3. యరుకలి లక్ష్మీదేవి భర్త సుంకన్న<br>4.యల్లన్న తండ్రి యర్రన్న<br>5. పోశన్న తండ్రి యెర్రన్న<br>6.జి.విజయ్ కుమార్ తండ్రి యరుకలి సవరన్న<br>7. కుర్వ కృష్ణ తండ్రి కుర్వ వెంకట్రాములు<br>8.కుర్వ నాగరాజు తండ్రి కుర్వ వెంకట్రాములు<br>9.సుంకన్న తండ్రి ఎల్లప్ప<br>10.ఆంజనేయులు తండ్రి ఎల్లప్ప | లేవు |
| 2 | 206 | పట్టా | మెట్ట | 0.30 | 1.కె.తిరుపతయ్య తండ్రి కుర్వ చిన్న నాగభూషణం<br>2. కె. రఘు తండ్రి కుర్వ చిన్న నాగభూషణం<br>3.పెద్ద నర్సింహులు తండ్రి పెద్ద నాగభూషణం<br>4.కుర్వ జయమ్మ భర్త చిన్న నర్సింహులు<br>5. జయమ్మ భర్త నర్సింహులు<br>6. పి.సి. చిన్నయ్య తండ్రి పి.సి. దౌలన్న<br>7. సి. స్వప్న భర్త తిరుపతి<br>8.యెర్రమ్మ భర్త ఎల్లప్ప<br>**అనుభవదారులు**<br>1. కుర్వ జయమ్మ భర్త చిన్న నర్సింహులు | లేవు |
| 3 | 207 | పట్టా | మెట్ట | 0.925 | 1. కదారి జ్యోతి భర్త బైరెడ్డి సత్యనారాయణరెడ్డి<br>2. డి.కవిత భర్త డి. లక్ష్మీకాంత్<br>3.టి.నాగలక్ష్మి భర్త ఎం.నాగరాజు<br>4.ముత్యాల పద్మ భర్త ముత్యాల ప్రభాకర్<br>5. వై.రాజారెడ్డి తండ్రి నాగిరెడ్డి<br>6. తుమ్మలపల్లి రామచంద్ర రెడ్డి తండ్రి తిమ్మారెడ్డి<br>**అనుభవదారులు**<br>1. డి. కవిత భర్త లక్ష్మీకాంత్<br>2.టి.నాగలక్ష్మి భర్త నాగరాజు<br>3. ముత్యాల పద్మ భర్త ముత్యాల ప్రభాకర్ | లేవు |
| 4 | 208 | పట్టా | మెట్ట | 0.075 | 1. దౌలమ్మ భర్త చిన్న గోవిందు<br>2.కుర్వ పెద్ద ఈదమ్మ భర్త కాశీమన్న<br>3. చెట్టెమ్మ భర్త కుర్వ నర్సింహులు<br>4. పద్మమ్మ భర్త కుర్వ నర్సింహులు<br>**అనుభవదారులు**<br>1.కుర్వ కిస్తన్న తండ్రి కుర్వ పెద్ద ఈదన్న | లేవు |
| 5 | 210 | పట్టా | మెట్ట | 0.40 | 1.ఎం. మొహమ్మద్ తండ్రి బడే హుస్సేన్ సాబ్<br>2.ఎన్.రాజేశ్వరి భర్త ఎన్. విద్యాసాగర్<br>3.మొహమద్ మసుమ్ పాషా తండ్రి దౌలత్ మొహమద్<br>4.ఎం. జహంగీర్ పాషా తండ్రి మొహమ్మద్ దౌలత్<br>5. నజీర్ పాషా తండ్రి దౌలత్ పాషా<br>6.కధారి జ్యోతి భర్త బైరెడ్డి సత్యనారాయణరెడ్డి<br>7.చక్రపాణి రెడ్డి తండ్రి చంద్రశేఖర రెడ్డి<br>**అనుభవదారులు**<br>1.మొహబూబ్ బీ భర్త మస్తాన్<br>2.మహమ్మద్ తండ్రి మస్తాన్<br>3.సుభాన్<br>4.నానుసాబ్ తండ్రి హుస్సేన్ | లేవు |
| 6 | 245 | పట్టా | మెట్ట | 1.725 | 1.రఘునాథ్ తండ్రి తెలుగు పెద్ద దర్శెల్లి<br>2.గోపాల్ తండ్రి తెలుగు పెద్ద దర్శెల్లి<br>3.తెలుగు గువ్వల వెంకటమ్మ భర్త తిమ్మన్న<br>4.గువ్వల పద్మ భర్త తెలుగు వెంకటేష్<br>5.గువ్వల నాగమ్మ భర్త చిన్న దౌలన్న<br>6. తెలుగు రాజు తండ్రి లక్ష్మన్న<br>7. తెలుగు గట్టు రాముడు తండ్రి గట్టు హనుమంతు<br>8.పైమసి ఈదమ్మ భర్త హనుమంతు<br>**అనుభవదారులు**<br>1.గువ్వల పద్మమ్మ భర్త గువ్వల వెంకటేష్<br>2.ఈదమ్మ భర్త హనుమంతు<br>3.గట్టు తెలుగు రాముడు తండ్రి గట్టు హనుమంతు<br>4. రంగనాథ్ తండ్రి తెలుగు దర్శల్లి | లేవు |
| 7 | 246 | పట్టా | మెట్ట | 0.40 | 1.గట్టు దర్శెల్లి తండ్రి హుసేనప్ప<br>2.బోయ శ్రీహరి తండ్రి ఆంజనేయులు<br>3.బోయ మురళీకృష్ణ తండ్రి ఆంజనేయులు<br>4.దౌలన్నా తండ్రి ఉసేనప్ప<br>5.గట్టు గోవిందమ్మ భర్త ఘట్టు మల్లన్న<br>6.గట్టు సావిత్రి భర్త కె.భాస్కర్<br>7.గట్టు సరస్వతి భర్త గట్టు మల్లేష్<br>**అనుభవదారులు**<br>1. గద్వాల్ సవరమ్మ<br>2. గట్టు గోవిందమ్మ భర్త మల్లయ్య | లేవు |
| | మొత్తం విస్తీర్ణము | | | 4.25 | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్‌కు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గద్వాల
సం/- అదనపు కలెక్టరు, జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO.585-LA/PP/ADVT/PUB/2926-27, Date:01-08-2026

# సిఎం.రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులకు వెంటనే క్షమాపణ చెప్పాలి

## జిల్లా బిజెపి అధ్యక్షుడు టి. రామాంజనేయులు

గద్వాల ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్స్ వేస్ట్ అని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వైయస్సార్ చౌక్ దగ్గర బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శనివారం తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్స్ వేస్ట్ అని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని,రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులకు ,పోలీసులకు స్వల్ప ఉద్రిక్తత నెలకొనడం తో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులను క్రిమినల్స్ వేస్ట్ అని సంబోధిస్తూ చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్



రెడ్డి వారిని ఈ విధంగా సంబోధించడం విద్యార్థులను, వారి కష్టాన్ని తీవ్రంగా అవమానించడమే అవుతుందని అన్నారు..తైయమైమఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇటీవల ఇంజినీరింగ్ పూర్తయిన విద్యార్థులకు కనీసం ఉద్యోగ దరఖాస్తులు నింపడం కూడా రాదని హేళన చేసిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ఏకంగా వారిని క్రిమినల్స్ వేస్ట్‌అంటూ నోరుపారేసుకోవడం వారి అహంకార పూరిత వైఖరికి నిదర్శనం కానీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం చూస్తుంటే రాష్ట్రంలో విద్యార్థులు ఎవరూ ఉన్నత చదువులు చదవకూడదని, ప్రతి ఒక్కరూ నిరక్షరాస్యులుగానే ఉండిపోవాలని వారు కోరుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. నిరుద్యోగ భృతి 4,000 వేలు, యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సంపూర్ణంగా విఫలమైన ఈ ప్రభుత్వం, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి విద్యార్థులపైనే ఇటువంటి నిందలు వేయడం దురదృష్టకరం అని కాంగ్రెస్ ప్రభుత్వ ఈ విద్యార్థి వ్యతిరేక విధానాలు, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమించి ఎండగడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, కౌన్సిలర్ శాలన్న,చంద్ర శేఖర్ ,బిజెపి సీనియర్ నాయకులు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి రజక నరసింహ, శ్రీను,తిమ్మన,బిజెవైఎం నాయకులు పటేల్ పాండు, గాంజ సాయి, సతీష్,లడ్డు రాజు,సంఘాల పవన్, తదితరులు పాలుగోన్నారు.

# చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : షేక్ అస్లాం షరీఫ్



వడ్డేపల్లి ఆగస్టు 01 ( విజన్ ఆంధ్ర)స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల కేంద్రం శాంతినగర్‌లో శాంతినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్ బీసీ హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుడికి ప్రత్యేక స్థానం ఉ ంటుందని, అందరూ స్నేహభావంతో మెలగాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం బీసీ హాస్టల్ వార్డెన్ మంజునాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరమేష్, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,(విజన్ ఆంధ్ర)బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామ్ మోహన్ రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కె. నిరోషా, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (ఎక్సైజ్) బి. కృష్ణ తేజ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో



అన్ని ప్రభుత్వ పాఠశాలలలో బాలల హక్కుల పరిరక్షణ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విపరీతమైన పోకడలతో చిన్న వయసులోనే దారి తప్పుతున్నారని, సోషల్ మీడియా ప్రభావం సమాజంపై పడి పిల్లలలో సైతం చెడు ప్రవర్తన కలుగుతుందని తెలిపారు. పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని, చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని, సమాజం పట్ల బాధ్యతలను తెలియజేయాలని అన్నారు. సమ సమాజ స్థాపనలో గురువుల పాత్ర అనిర్వచనీయమైనదని, పిల్లలు, కళాశాల యువత మద్యపానం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా వారిని సన్మార్గంలో నడిచే విధంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ కోసం స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనంలోనే మంచి అలవాట్లు పిల్లలకు నేర్పించాలని, గుడ్ టచ్ – బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలకు వారి హక్కుల గురించి వివరించడం జరుగుతుందని, జె జె, పోక్సో చట్టాలపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని, బాల కార్మికులను రక్షించి వారికి నిర్బంధ విద్య అందిస్తున్నామని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులకు గురైన బాధితులను గుర్తించడం, బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించడం, బాలలపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని, బాలల హక్కులను రక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, బాలలను సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో వచ్చే అసాంఘిక అంశాలను నిరోధించి పిల్లలు చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు,బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు2026 ఘనంగా ప్రారంభం

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,(విజన్ ఆంధ్ర)ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఈ సంవత్సరపు థీమ్‌తో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవగాహన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టిన మొదటి గంటలోపు తల్లిపాలు పట్టించడం, శిశువుకు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన పరిపూరక ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువుల ఆరోగ్యం, ఎదుగుదల, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని తెలిపారు గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన జీవితానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, గర్భిణీలు, బాలింతల సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోషణ్ అభియాన్ బృందం, జఞూాలు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

## సన్నాహక సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ పిలుపు




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1,(విజన్ ఆంధ్ర) ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను చాటిచెప్పే అత్యంత ప్రాముఖ్యమైన సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఐక్యతతో, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించి ఆదివాసీ సమాజ ఐకమత్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత మరియు ప్రజలు సమన్వయంతో పాల్గొని సహకరించాలని కోరారు. సమావేశంలో రాజ్ గోండ్ సేవా సమితి జాతీయ అధ్యక్షులు సిడాం అర్జు మాస్టర్, ఆసిఫాబాద్ మండల సార్ మేడి జ్ఞానేశ్వర్, ప్రధాన్ పురోహిత్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు పెందూర్ సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించి, అందరూ సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు పి ఏం ఆర్ సి ఏ సి ఏం ఓ పూర్కా ఉద్ధవ్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడాల అధికారి మాడావి శేఖు లు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన "ఆపరేషన్ ముస్కాన్ XII»»

## 40 మంది చిన్నారులకు రక్షణ బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 20 కేసులు నమోదు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 01( విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జులై 1 నుండి జులై 31 వరకు నిర్వహించిన "ఆపరేషన్ ముస్కాన్ ॰ ×× " విజయవంతంగా ముగిసింది. జూలై నెల పొడవునా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన, అనాథ, నిరాశ్రయులు మరియు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించేందుకు ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 మంది చిన్నారులను గుర్తించి రక్షించడం జరిగింది. వీరిలో 24 మంది బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 20 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోగా, మిగిలిన 16 మంది చిన్నారులకు మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికీ అప్పగించడం జరిగిందిపోలీస్ స్టేషన్ వారీగా రక్షించబడిన చిన్నారుల వివరాలు– మహబూబాబాద్ సబ్ డివిజన్ : 23 మంది చిన్నారులు రక్షణ, 10 కౌన్సెలింగ్/12 ఎఫ్‌ఐఆర్‌లు.– తొర్రూర్ సబ్ డివిజన్ : 17 మంది చిన్నారులు రక్షణ, 06 కౌన్సెలింగ్, 08 ఎఫ్‌ఐఆర్‌లు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి విద్య, భద్రత, ఆరోగ్యకరమైన బాల్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని అన్నారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ ॰ ×× విజయవంతం కావడానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ (జఔజ, ఐజూఖ), చైల్డ్ హెల్ప్‌లైన్ ॰ 1098, కార్మిక శాఖ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.
బాలకార్మికులు, అనాథలు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే డయల్ ॰ 100, 112 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ ॰ 1098కు సమాచారం అందించి వారి భవిష్యత్తును కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# ఆపరేషన్ ముస్కాన్ XII విజయవంతం

## జిల్లాలో 95 మంది బాలకార్మికులకు విముక్తి



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 02(విజన్ ఆంధ్ర)బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ ॰ ×× కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు విశేష ఫలితాలు సాధించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 95 మంది బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రత్యేక బృందాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్పీ వెల్లడించారు. గుర్తించిన 95 మంది బాలల్లో 89 మంది బాలురు, ఆరుగురు బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న 48 మంది యజమానులపై కేసులు నమోదు చేయగా, మరో 38 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఎక్కడైనా చిన్నారులను పనిలో పెట్టుకున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ ॰ ××ను విజయవంతంగా నిర్వహించి బాలలను వారి కుటుంబాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన ప్రత్యేక బృందాల సభ్యులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , ఆగస్టు 1 (విజన్ ఆంధ్ర ): మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు అధికారులు నూతనంగా తమ బాధ్యతలను స్వీకరించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను నూతన అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా మరియు జిల్లా సబ్ జైళ్ల అధికారిగా 1999 బ్యాచ్‌కు చెందిన జైళ్ల శాఖ అధికారి దార్ల కాళిదాస్ బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన గతంలో చంచల్‌గూడ, చర్లపల్లి కేంద్ర కారాగారాలు మరియు ఓపెన్ జైలు వంటి ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శశికాంత్ చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కాళిదాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా క్రమశిక్షణ, భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ ఖైదీల సంక్షేమం, పునరావాస కార్యక్రమాల సమర్థ అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఇక జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సి.పి.ఓ)గా బి. నర్సింహులు కూడా శనివారం బాధ్యతలు స్వీకరించారు. గణాంక శాఖ డైరెక్టర్ (హైదరాబాద్) ఉత్తర్వుల మేరకు ఆయనకు ఈ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో సి.పి.ఓగా పనిచేసిన కె. రవీందర్ జూలై 31న పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, ప్రస్తుతం అదే కార్యాలయంలో గణాంక అధికారిగా ఉన్న నర్సింహులను ఈ పదవికి నియమించారు. జిల్లాలో ప్రణాళిక, గణాంక విభాగాల పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధికారులకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేసి వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు

# కొత్తగూడెంలో మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్12 వాహనాలపై కేసులు




కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 02(విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ మోడిఫైడ్ సైలెన్సర్లతో సంచరిస్తున్న ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 12 ద్విచక్ర వాహనాలు చట్టవిరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయా వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ॰ 1988లోని సెక్షన్ 190(2) ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. అనంతరం వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. ఇటువంటి మార్పులు చట్టవిరుద్ధమని, వాహనదారులు కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# దివ్యాంగుల సదరం ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1,(విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దివ్యాంగులకు అవసరమైన సదరం వైకల్య ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉ న్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో సదరం ధృవీకరణ పత్రాల జారీకి సగటున 75 రోజుల సమయం పడుతుందని, ఈ సమయాన్ని 30 రోజులకు తగ్గించేలా అన్ని జిల్లాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు తెలిపారు.
దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, సమయపాలనతో సేవలు అందించాలని, గిరిజన, మారుమూల, దూర ప్రాంతాలలో నివసించే దివ్యాంగుల సౌకర్యార్థం మండల స్థాయిలోనే ప్రత్యేక సదరం వైద్య శిబిరాలను నిర్వహించాలని, దివ్యాంగులకు స్థానికంగానే వైద్య పరీక్షలు నిర్వహించి ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని



తెలిపారు. గిరిజన ప్రాంతాల నుంచి జిల్లా ఆసుపత్రులు, సదరం కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు చేయూత, అడ్మిన్ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రభుత్వ సేవలు వారి వద్దకే చేరే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఆర్.టి.సి. ॰ సదరం కేంద్రం పునరుద్ధరణ పనుల కోసం 43 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే ఆ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఈ నిధులతో సదరం సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించబడతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగ చిన్నారులందరికీ 100 శాతం సదరం ధృవీకరణ పత్రాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని, దివ్యాంగ పిల్లలకు సకాలంలో ధృవీకరణ పత్రాలు అందితే విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా పొందే అవకాశం ఉ ంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన, మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న దివ్యాంగులకు సేవలు మరింత చేరువయ్యేలా మొబైల్ మెడికల్ బృందాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో సదరం ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా ప్రతి అర్హుడికి ధృవీకరణ పత్రం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రామకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక లాభాల పేరుతో కోట్ల మోసం

### 35 వాహనాలు, విలువైన ఆస్తులు స్వాధీనం
### భారీ ఆర్థిక నేరాన్ని ఛేదించిన కొత్తగూడెం పోలీసులు

కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 02(విజన్ ఆంధ్ర)అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడులు సేకరించి మోసానికి పాల్పడిన కేసును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 35 వాహనాలతో పాటు ఇతర నేరార్జిత ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన దర్యాప్తులో, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు.భార్వాటి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి సుమారు రూ.52 కోట్ల మేర డబ్బులు సేకరించినట్లు గుర్తించారు.బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీ ఇచ్చినట్లు విచారణలో తేలింది. బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలాలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకొచ్చి విచారించారు. విచారణలో భాగంగా 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు,



14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను నేరార్జిత ఆస్తులుగా భావించి స్వాధీనం చేసుకున్నారు.అలాగే బాధితుల నుంచి సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు.ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సంబంధిత పత్రాల పరిశీలన కొనసాగుతోందని, మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.అధిక లాభాలు, తక్కువ సమయంలో రెట్టింపు రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని ప్రజలకు పోలీసులు సూచించారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 1,(విజన్ ఆంధ్ర)జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాల పెంపు, బోధన–అభ్యాసన ప్రక్రియ బలోపేతం, ప్యానెల్ ఇన్స్పెక్షన్ల సమర్థవంతమైన నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శనివారం జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయుల పానెల్ టీం సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్యానెల్ ఇన్స్పెక్షన్లు కేవలం తనిఖీలుగా కాకుండా ప్రతి పాఠశాలలో విద్యా నాణ్యతను మెరుగుపరిచే మార్గదర్శక ప్రక్రియగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన స్థాయి, తరగతి గది బోధన, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, విద్యార్థుల నోటుబుక్స్, మూల్యాంకన విధానం, హాజరు, పరిశుభ్రత, గ్రంథాలయ వినియోగం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ వినియోగం, ప్రయోగశాల వినియోగం, క్రీడలు, మౌలిక వసతులు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. పానల్ ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలలో విద్యా ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. సబ్జెక్టు పానెల్ ఉపాధ్యాయులు విద్యార్థులలో భావనాత్మక అవగాహన పెంపొందించే విధంగా సృజనాత్మక బోధన పద్ధతులను అమలు చేయాలని, ప్రతి విద్యార్థి నేర్చుకునేలా బాధ్యతతో పని చేయాలని తెలిపారు. ప్యానెల్ ఇన్స్పెక్షన్లలో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దుతూ, పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి జిల్లాను విద్యా రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధన అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పానెల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్రము రాష్ట్ర ప్రభుత్వం అందించే ఫలాలను అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 01 ఆగస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగాఅమలయ్యేలాచూడాలని జిల్లా కలెక్టర్కే. హైమావతి అధికారులను ఆదేశించారశనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా మరియు కొన్ని పథకాలను సంయుక్తంగా అమలు చేస్తున్నాయని అవి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు ఆయా పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, రైతు సంక్షేమం, ఉద్యానవనం,పశుసంవర్ధకం, మత్స్య సంపద పెంపు, గ్రామీణ అభివృద్ధి, పునరుత్పాదక ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన, భూగర్భ జలాల పెంపు, గృహ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, మహిళలు మరియు మానవ వనరుల అభివృద్ధి సంబంధిత పథకాలు పారదర్శకంగా అమలై వాటి



వలన పేద ప్రజలు లబ్ధి పొంది అభివృద్ధి చెందేల ప్రణాళిక బద్దంగా పని చేయాలనిఈసందర్భంగా జిల్లా కలెక్టర్ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ సర్కిల్ లో కమిషనర్ ఆకస్మిక పర్యటన

## రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలించిన మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మేడ్చల్/బోడుప్పల్, ఆగస్టు01(విజన్ ఆంధ్ర ప్రతినిధి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డిక్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా శనివారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వీరారెడ్డి నగర్ కాలనీలోఆయన డిప్యూటీ కమిషనర్ శైలజ తో కలిసి స్థానిక సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు



సూచించారు.రహదారుల మరమ్మతు పనులు, డ్రైనేజీల శుభ్రత, చెత్తను సకాలంలో తొలగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చెంగిచెర్ల డివిజన్ సమస్యలపై బీజేపీ సమరశంఖం

## వక్ఫ్ బోర్డు, మేకలమండి,రోడ్లు,మంచినీటి సమస్యలపై కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు



బోడుప్పల్,ఆగస్ట్ 01(విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు ఎర్రుల మహేష్ ఆధ్వర్యంలో శనివారం బోడుప్పల్ సర్కిల్ లో డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జి శోభారెడ్డి ,యువమోర్చా రాష్ట్ర నాయకులు సామల పవన్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బజారు కిరణ్ గౌడ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి లు పాల్గోన్నారు.ఈ సందర్భంగా చెంగిచెర్ల డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలైన వక్ఫ్ బోర్డు, మేకలమండి,డివిజన్‌లో రోడ్ల దుస్థితి, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏనుగు లక్ష్మయ్య, రాసాల నర్సింగ్ రావు, కూరపాటి విజయ్ కుమార్, పద్మారెడ్డి, కరుణాకర్, ఎస్.ఎం. ప్రగతి,డివిజన్ నాయకులు గండిపల్లి రాజు, కిషోర్ నాయుడు, బజ్జూరి శ్రీనివాస్, రాజిరెడ్డి, కాంతారెడ్డి, విజయరెడ్డి, హరిపురం నవీన్, భారత్ పటేల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 01(విజన్ ఆంధ్ర);–ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుంచి 7 వరకు) జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు, మీడియా నోట్, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఇటీవల సూపర్వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గుర్తించిన లోపాలను పరిశీలించి, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, గుర్తించిన ప్రతి లోపాన్ని నిర్దిష్ట గడువులోగా సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిపాలు ప్రతి శిశువుకు మొదటి హక్కు, సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై



అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ సరైన కౌన్సెలింగ్ అందించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో ప్రసవించిన ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈసమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీఓలు, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా భైరబోయిన ప్రసాద్ యాదవ్ ఏకగ్రీవ ఎంపిక

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 01(విజన్ ఆంధ్ర);–హైదరాబాద్‌లోని సుందరయ్య కళా విజ్ఞాన భవన్‌లో శనివారం (01-08-2026) జరిగిన జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోని “యాదవ కంఠం“ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు కొక్కు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో భైరబోయిన ప్రసాద్ యాదవ్ (గ్రా/రా కొమురయ్య) ను వరంగల్ జిల్లా జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు భైరబోయిన ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.“నాపై నమ్మకం ఉంచి వరంగల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ గారికి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగి శ్రీనివాస్ యాదవ్ గారికి, రాష్ట్ర అధ్యక్షులు కొక్కు దేవేందర్ యాదవ్ గారికి, యాదవ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా సమాజం నాపై ఉంచిన విశ్వాసంగా భావిస్తున్నాను. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అంకితభావంతో పనిచేస్తాను.“ అని అన్నారు.“యాదవుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతాను. సమాజంపై ఎక్కడైనా అన్యాయం, వివక్ష, రాజకీయంగా అణచివేత జరిగినా మౌనంగా ఉండను. యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రతి వేదికపై



గళమెత్తుతాను. న్యాయం కోసం ఎంతటి శక్తివంతుడినైనా ఎదుర్కొనే ధైర్యంతో ముందుకు సాగుతాను. జిల్లా వ్యాప్తంగా యాదవ యువతను, మేధావులను, ప్రజాప్రతినిధులను ఏకం చేసి సమాజ అభివృద్ధికి కృషి చేస్తాను.“ అని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తూ, “నాపై ఉంచిన నమ్మకాన్ని ఎన్నటికీ వమ్ము చేయను. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆశయాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి యాదవుల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తాను.“ అని భైరబోయిన ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు.

# పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయంగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 01(విజన్ ఆంధ్ర) ;–రైతులు పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయ కార్యకలాపంగా చేపట్టి అధిక, స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో “మేరా రేషమ్ మేరా అభిమాన్" 2.0“ కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ సమన్వయంతో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాటాదారుల సంప్రదింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.



వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా వినియోగించాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఆయిల్ పామ్ తోటల్లో మల్బరీని అంతర పంటగా సాగు చేయడం, మల్బరీని సేంద్రీయ విధానంలో పండించడం, అంతర పంటలుగా పూల సాగు చేపట్టడం, భూగర్భ జలాల పరిరక్షణ కోసం వ్యవసాయ క్షేత్రాల్లో చెరువుల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.పట్టు ఉత్పత్తులకు విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలను మరింతగా వినియోగించుకోవడానికి వరంగల్ టెక్స్టైల్ పార్క్ సౌకర్యాలు, జిల్లాలోని ఎగుమతి హబ్‌ను రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు శ్రీమతి భువన (సైంటిస్ట్–బి), డా. బి. తిరుపం రెడ్డి (సైంటిస్ట్–సి) జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి బోర్డు అందిస్తున్న సాంకేతిక సహాయం, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించారు.జాయింట్ డైరెక్టర్ అనుసూయ, అసిస్టెంట్ డైరెక్టర్ (సెరికల్చర్) తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాల గురించి వివరించారు.ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులను మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం వైపు ప్రోత్సహించేందుకు ఇదే అనుకూల సమయమని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి అనుకూల వాతావరణం, మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.“మేరా రేషమ్ మేరా అభిమాన్" 2.0“ ద్వారా సెంట్రల్ సిల్క్ బోర్డు అందిస్తున్న మార్గదర్శకాలు పట్టు రైతుల ఉత్పాదకత, నాణ్యత, మార్కెట్ అనుసంధానాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. విజయవంతమైన పట్టురైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని మరింత మందిని ఈ రంగం వైపు ఆకర్షించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నాసిరకం విత్తనాలు.. రైతుల బతుకులో మంటలు

### విజన్ ఆంధ్ర వార్తకు స్పందించిన వ్యవసాయ అధికారులు
### క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి

అయిజ ఆగస్టు 01( విజన్ ఆంధ్ర)నాణ్యతలేని వేరుశనగ విత్తనాల సంఘటనపై జులై 30వ తేదీన విజన్ ఆంధ్ర దినపత్రికలో వచ్చిన వార్తలపై జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు.శనివారం అయిజ మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ పర్దపురం గ్రామంలో రైతు పొలం దగ్గరకు వెళ్లి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జనార్ధన్ మాట్లాడుతూజోగులాంబ గద్వాల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రైతు భూమిలో పంటను చైత్ర స్థాయిలో పరిశీలించి, విచారించి సంబంధిత నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతు పాల్గొన్నారు.


నాసిరకం విత్తనాలు‘..
రైతు బతుకులో మంటలు.!
- మోసపోయిన రైతు ఆగ్రహజ్వాల..
విత్తన దుకాణం ఎదుట నిరసన రణభేరి!
- అధికారుల నిర్లక్ష్యం.. అక్రమార్కుల దందాకు ఇంకెన్ని బలులు..?
అయిజ జూలై 30 ( విజన్ ఆంధ్ర) : నాసిరకం విత్తనాల రాక్షస క్రీడకు మరో రైతు బలిపీఠమెక్కాడు! వ్యాపారి చెప్పిన అబద్ధాలను నమ్మి విత్తనాలు కొని, ఉన్నదంతా ఊడ్చి సాగు చేస్తే చివరికి

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మక అల్పాహార పథకం ప్రారంభం

## విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రగతికి దోహదం



బోడుప్పల్ ,ఆగస్ట్ 01(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహార పథకం శనివారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్ తమ పాఠశాలలో అల్పాహార పథకం అమలును పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం నాణ్యత, పరిశుభ్రత, వడ్డింపు విధానాన్ని పరిశీలించారు.అనంతరం ఎంపీపీఎస్ మేడిపల్లి, ఎంపీపీఎస్ కమలనగర్ పాఠశాలల్లోనూ పథకం అమలును పర్యవేక్షించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ప్రభుత్వ నిర్ణయం మేరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను విస్తరించడం విశేషమని తెలిపారు. పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, పాఠశాల హాజరు శాతం, విద్యా ప్రగతి మరింత మెరుగుపడుతుందని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కాలి

## ఎస్ఐఆర్ లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,గజ్జల కాంతం



బోడుప్పల్,ఆగస్టు 1(విజన్ ఆంధ్ర) :మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పరిధిలో బోడుప్పల్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మకు కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి గజ్జల కాంతం, కోఆర్డినేటర్ ప్రభాకర్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం అత్యంత ముఖ్యమన్నారు. కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరంబొమ్మకు కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాయకులు, బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు భుక్యా సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్, పొద్దుటూరి వెంకటేష్ గుప్తా,గుర్రాల వెంకటేష్ యాదవ్, జక్క రాములు, విశ్వం గుప్తా,పక్కీర్ హరినాథ్ రెడ్డి,అసర్ల బీరప్ప, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సమతా యాదవ్, దయ్యాల అలివేలు, పద్మ,అంబాల అరవింద్, అర్జున్, సురేష్, రాహుల్, అనిల్, శ్రీను ,అంబేద్కర్ నగర్, దేవేందర్ నగర్, రాజీవ్ నగర్, రాజీవ్ నగర్ ఫేజ్ 2, అంబేద్కర్ నగర్ ఫేజ్ 3 కాలనీవాసులు,బీఎల్ఏలుతదితరులు పాల్గొన్నారు.

# విశ్వేశ్వరయ ఇంజనీర్స్ కాలనీలో ఘనంగా వన మహోత్సవం

## -మొక్కలు నాటిన విశ్వేశ్వరయ ఇంజనీర్స్ కాలని వాసులు



ఎల్బీనగర్ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, అర్బన్ బయోడైవర్సిటీ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ ఆఫీసర్ సుధారాణి, సర్కిల్ మేనేజర్ ఎ శ్రీనివాసచారి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్, హార్టికల్చర్ సూపర్ వైజర్ గణేష్ ఎం.ఎం.సి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు కాలనీ వాసులు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుదాం వాటిని రక్షిద్దాం వర్షాలను ఆహ్వానిద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంకాల శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోల్కొం అమరనాథ్ యాదవ్, కోశాధికారి ధర్మారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ రెడ్డి, ఎం ప్రవీణ్ రెడ్డి, ఐలేష్ గౌడ్, అల్వాల్ గౌడ్, శివ శంకర్ రెడ్డి, వీరేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, లట్టుపల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేర్‌లో వీఎన్ఎస్ చికిత్సతో మూర్ఛ వ్యాధికి ఉపశమనం



హైదరాబాద్, ఆగస్ట్ 01 (విజన్ ఆంధ్ర) : కేర్ హాస్పిటల్స్ లో వరంగల్‌కు చెందిన 34 ఏళ్ల ప్రతిమకు డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీకి వేగస్ నర్వ్ స్టిమ్యులేషన్(వీఎన్ఎస్) చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేర్ హిస్పిటల్స్ బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిలెప్సీ, న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ శశాంక్ జైస్వాల్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ చికిత్సతో మూర్ఛలు గణనీయంగా తగ్గి ఆమె ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. అత్యాధునిక వీఎన్ఎస్ చికిత్సతో క్లిష్టమైన మూర్ఛ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

# తడకలు, రేకుల షెడ్డులోనే నిరుపేద కూలీల జీవనం..

# రెండో ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై ఆశలు

## గత ఎంపికలో అవకతవకల ఆరోపణలు మళ్లీ చర్చనీయాంశం



వాంకిడి ఆగస్టు 1(విజన్ ఆంధ్ర) కొమురం భీం జిల్లా వాంకిడ మండలం ప్రభుత్వం పేదలందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో వేలాది నిరుపేద కుటుంబాలకు ఆశాకిరణంగా మారింది. అయితే ఇప్పటికీ అనేక గ్రామాల్లో నిజంగా ఇల్లు లేని కుటుంబాలు తడకలు, రేకులు, ప్లాస్టిక్ షీట్లతో నిర్మించిన పూరి గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నాయి.ఇందులో ఒక గ్రామపంచాయతీ వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ ఒకటి ప్రతి ఎన్నికల సమయంలో, ప్రతి ప్రభుత్వ పథకం ప్రకటించినప్పుడు ఈసారైనా మనకు ఇల్లు వస్తుందేమో అని ఎదురుచూసే కుటుంబాల్లో నిరుపేద కూలీ కుటుంబాలు ఆశగా సరండి గ్రామపంచాయతీ లో జీవిస్తూ ఎదురు చూస్తున్నాయి. రోజూ కూలి దొరికితేనే పొయ్యి అంటించే పరిస్థితి. వచ్చిన కూలితో కుటుంబ పోషణే కష్టంగా మారుతున్న వేళ పక్కా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత కొంతమందికి లేదు. గ్రామ శివారులో తడకలు, రేకులు, పాత టిన్ షీట్లు, ప్లాస్టిక్ కవర్లతో నిర్మించిన చిన్న షెడ్డులోనే కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. వర్షం కురిస్తే గుడిసె మొత్తం తడిసి నీరు కారిపోవడం, గాలి బలంగా వీచిన ప్రతిసారి షెడ్ ఎప్పుడు ఎగిరిపోతుందోనన్న భయం, వేసవిలో మండే ఎండ, చలికాలంలో తీవ్రమైన చలి ఇవన్నీ వారి నిత్యజీవితంలో భాగమయ్యాయి. చిన్నారులు చదువుకోవడానికి సరైన వాతావరణం లేకపోవడం, వర్షాకాలంలో గుడిసెలోకి నీరు చేరడంతో సామాన్లు తడిసిపోవడం, రాత్రివేళల్లో పాములు, తేళ్లు వంటి విషజంతువులు వస్తాయేమోనని భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే గృహ పథకమే ఒకే ఒక్క ఆశగా మారింది. అయితే గతంలో విడుదలైన మొదటి ఇందిరమ్మ ఇళ్ల జాబితా గ్రామంలో తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. గ్రామసభలో పలువురు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు బహిరంగంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని ఆరోపించారు. నిజంగా గుడిసెల్లో జీవిస్తున్న పేదలను పక్కనబెట్టి, ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న కొందరికి ప్రాధాన్యం ఇచ్చారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఎంపిక ప్రక్రియలో జాప్యం, నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామసభలోనే ప్రస్తావించినట్లు గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. గ్రామంలోని మాదిగ దళిత కుటుంబాలకు కూడా తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు గ్రామస్థులు అప్పట్లో వాపోయారు. ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లోనే జీవిస్తున్నా, ప్రభుత్వ పథకాల జాబితాల్లో తమ పేర్లు కనిపించకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన అర్హుల జాబితా తయారీలో క్షేత్రస్థాయి పరిశీలన సరిగా జరగలేదని, పేదల పరిస్థితిని ప్రత్యక్షంగా చూసి నిర్ణయం తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు అభిప్రాయపడ్డారు. లక్ష్మణ్ వంటి నిరుపేద కూలీలు ఇప్పటికీ గ్రామంలో అనేక మంది ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. వీరికి ఇల్లు భూమి ఉన్నా ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. మరికొందరికి కనీస స్థలం కూడా లేక అద్దె గుడిసెల్లో లేదా తాత్కాలిక షెడ్డుల్లో జీవనం సాగిస్తున్నారు. అలాంటి కుటుంబాలే ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు లబ్ధిదారులని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. ఇటీవల రెండో ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధమవుతోందనే సమాచారంరావడంతో గ్రామంలోని నిరుపేద కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈసారి అయినా అధికారులు రాజకీయాలకు, సిఫార్సులకు, ఇతర ప్రభావాలకు అతీతంగా నిజంగా ఇల్లు లేని కుటుంబాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించి, తడకలు, రేకుల షెడ్డుల్లో జీవిస్తున్న కుటుంబాలను ప్రాధాన్యంతో ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గుడిసెల్లో జీవిస్తున్న పేదలకు ఇళ్లు ఇవ్వడానికే ప్రభుత్వం పథకాలు తీసుకొస్తే, అలాంటి వారే జాబితాలో లేకపోతే పథకం ఉద్దేశం ఏమిటి? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నారు. ప్రస్తుతం లక్ష్మణ్ కుటుంబంతో పాటు గ్రామంలోని మరెన్నో నిరుపేద కుటుంబాలు రెండో ఇందిరమ్మ జాబితా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. ఈసారి వారి జీవితాల్లో నిజంగా మార్పు వస్తుందా? తడకలు, రేకుల గుడిసెల స్థానంలో సిమెంట్ గోడలతో కూడిన సురక్షితమైన ఇల్లు లభిస్తుందా? లేక మరోసారి నిరాశే మిగులుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం త్వరలో వెలువడనున్న జాబితాతోనే తేలనుంది.నిజంగా పేదరికంలో జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి వారికి గృహ వసతి కల్పించినప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు లక్ష్యం నెరవేరుతుంది. పేదల గుడిసెలను పక్కా ఇళ్లుగా మార్చే దిశగా అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తేనే గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# డి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో 3న కలెక్టరేట్ ముందు ధర్నా

## డి హెచ్ పి ఎస్ జిల్లా నిర్మాణ భాద్యులు దాగం మల్లేష్




మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,(విజన్ ఆంధ్ర) రాష్ట్ర ప్రభుత్వం పేదల సమస్యలు పరిష్కరించడం లో పూర్తిగా నిర్లక్ష్యం వాహించడాన్ని నిరసిస్తూ ఈ నెల 3 న మంచిర్యాల జిల్లా కలెక్టరెట్ ముందు దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్ ) ఆధ్వర్యంలో ఆగస్టు 3 న జరుగు ధర్నాను జయప్రదం చేయాలని శనివారం ఆ సంఘం నిర్మాణ బాద్యులు దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయస్తం దళితులకు 12 లక్షలు తక్షణమే ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు సాగు భూములను పంపిణీ చేయాలని, అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి భూమి హక్కును కల్పించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిరుపేదలకు ఇంటి స్థలాలు మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించి పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు బొల్లం తిలక్, దాసరి శ్రీధర్, దుర్గం దేవదాస్, బొంతల లక్ష్మీనారాయణ, రత్న రాజం నక్క వెంకటస్వామి కోడి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నీతికా పంత్బిప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

## పెన్‌గంగ, ప్రాణహిత నదుల ఉధృతిపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘాలి

## వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలకు అనుమతి ఇవ్వొద్దు అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశం



సిర్పూర్ నియోజకవర్గం ఆగస్టు 1(విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెన్‌గంగ, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సిర్పూర్ (టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న వెంకట్రావుపేట వంతెన, పారిగాం ప్రాంతాలను, అలాగే కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పెన్‌గంగ, ప్రాణహిత నదుల ఉధృతి దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోప్‌లు, లైఫ్ బాయ్‌లు, లైఫ్ జాకెట్లు తదితర అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.వరద ఉధృతి పూర్తిగా తగ్గిన తర్వాత మాత్రమే వాహనాలు, ప్రజల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా, ముఖ్యంగా చేపల వేట కోసం నదిలోకి దిగే సాహసం చేయవద్దని, భారీ వరద ఉధృతి నేపథ్యంలో పడవలు నడపరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అధికారుల సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఈ పరిశీలనలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నానో యూరియా అమ్మకాలు పెరగాలి

## ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఎర్రవల్లి ఆగస్టు 01( విజన్ ఆంధ్ర బ్యూరో)యూరియాను అధిక మొత్తంలో వినియోగిస్తుండడంతో వ్యవసాయ క్షేత్రాలు సారవంతతను కోల్పోతున్నాయని, అన్నదాతలు నానో యూరియా ఎక్కువగా వినియోగించేలా వాటి అమ్మకాలను పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని వెంకటరమణ పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్,. సీడ్స్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాలు, ఎరువుల విక్రయాలు, వాటి ధరల గురించి దుకాణ యజమానిని అడిగారు. వివిధ స్టాక్ రిజిస్టర్ లను, పలు కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. యూరియాను ఆన్లైన్లో బుక్ చేస్తుండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు ఎక్కువగా నానో ఏరియా వినియోగించేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉ ందన్నారు. ఎల్ నినో నేపథ్యంలో వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైన కందులు, కూరగాయలు, తదితర సాగుపై ఎక్కువగా దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పెస్టిసైడ్స్, సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏడిఏ సుబ్బారెడ్డి, ఏవో సురేష్ గౌడ్, ఏఈఓ నరేష్, తదితరులున్నారు.

# చిన్నారుల ఆరోగ్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 01(విజన్ ఆంధ్ర);-జిల్లాలోని ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్టు ఉర్సు సెక్టార్-42 పరిధిలోని మేరవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్రంలోని పరిసరాల పరిశుభ్రత, రికార్డులు, కొలతలు (మెజర్‌మెంట్స్), పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రీ-స్కూల్ బోధనా కార్యక్రమాలను గమనించి అంగన్‌వాడీ టీచర్‌కు పలు సూచనలు చేశారు.అనంతరం చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్, వారి ప్రతిభను అభినందించారు. పిల్లలకు తప్పనిసరిగా కాచి చల్లార్చిన మంచినీటినే అందించాలని సిబ్బందికి సూచించారు.అంగన్‌వాడీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఆడపిల్లలు ఉన్న కుటుంబాలు బాలిక సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకుంటే భవిష్యత్తులో ఉన్నత విద్యకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని తల్లులకు వివరించారు.అనంతరం చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీఓ విద్య, సూపర్వైజర్ బత్తిని రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ వినిత, ఏఎల్ఎంసీ కమిటీ సభ్యులు స్పందన, రమ్య, శ్రీలత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టులు: తుమ్మల

హైదరాబాద్,ఆగస్ట్1: తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు.

## పిల్లలు బడిలో ఉండాలి.. పనిలో కాదు: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత




వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 01(విజన్ ఆంధ్ర);-పిల్లలు బడిలో ఉండాలే తప్ప పనుల్లో కాదని, బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ' పన్నెండో దశలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 314 మంది చిన్నారులను రక్షించినట్లు ఆమె తెలిపారు. వీరిలో 226 మంది బాల కార్మికులు, 85 మంది బడి మానేసిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యేక బృందాలతో హోటళ్లు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. బాల కార్మికులపై ఉక్కుపాదంరక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి, కౌన్సెలింగ్ అనంతరం కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 55 కేసులు నమోదు చేయగా, కార్మిక శాఖ 92 తనిఖీ నివేదికలు నమోదు చేసిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## అలంపూరు లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలి

**తహసల్దార్ ప్రభాకర్ కి, సబ్ రిజిస్ట్రార్ మౌనిక కి వినతి పత్రం అందజేసిన స్థానిక నాయకులు, యువకులు, పట్టణ ప్రజలు**



అలంపూర్ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణ కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అలంపూర్ చౌరస్తాకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహసిల్దార్ ప్రభాకర్ కి, సబ్ రిజిష్టర్ మౌనిక కి అలంపూరు లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలని వినతి పత్రం అందజేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూదశాబ్దాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలిస్తే అలంపూర్ పరిసర ప్రాంత ప్రజలు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూరు నియోజకవర్గ కేంద్రంగా ఉన్నందున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉండాలని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీకోని ఇద్దరికి తీవ్రగాయాలు




వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు01(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా కేంద్రంలో ని పర్వతగిరి మండలం సోమారం గుంటూరు పల్లి శివారులో చోటు చేసుకుంది లవడ్యా గణేష్ (40)కుకుడి కాలు విరిగినది. గుంటూరుపల్లె నివాసి పర్వతగిరి నివాసి సిరికొండ ప్రశాంత్ కు(35)ఎడమ చేతి విరిగినది. ఇద్దరు ఎదురు ఎదురు గా రావడం ఈ ప్రమాదం చోటుచేసుంది స్థానికులు 108కీ కాల్ చేసారు సమాచారం అందుకున్న సిబ్బంది ఇఎమ్ టి రాజు నాయక్ పైలెట్ రవీందర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి ఎంజీఎం వరంగల్ ఆసుపత్రి తరిలించారు

## పదవి విరమణ పొందిన పోలీస్ ఆఫీసర్స్ కి శుభాకాంక్షలు తెలిపిన- జిల్లా అడిషనల్ ఎస్పీఎన్ వెంకటేశ్వర్లు

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన ఏ. గోపాల్ꟷూూ× చారకొండ పోలీస్ స్టేషన్, మహమ్మద్ పాషా ఎజ ఊరకొండ పోలీస్ స్టేషన్ ఈరోజు పదవి విరమణ పొందారు, ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం ఎన్నో సంవత్సరాల పాటు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పోలీసు శాఖలో మీరు అందించిన సేవలుచిరస్మరణీయమైనవి ,మీ వృత్తి జీవితంలో సాధించిన విజయాలు, సంపాదించిన గౌరవం, ప్రజలఅభిమానమే మీ సేవలకు నిదర్శనం. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమే, జీవితానికి కాదు. ఇకపై మీరు మీ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా,సుఖసంతోషాలతోఉండాలనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డిఎస్పి సాయి వెంకట్ రెడ్డి , అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు ,జజూ జ× శంకర్,ꟷూూ కృష్ణయ్య, నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ఏఎస్ఐ గునవర్ధన్ తో పాటు వారి కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్స్ అందరికి పాత ఈహెచ్ ఎస్ కార్డ్ తో కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం - లక్ష్మీ రెడ్డి జిల్లా అధ్యక్షులు



గద్వాల ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర కరస్పాండెంట్) ప్రభుత్వ పెన్షనర్స్ కు పాత ఈహెచ్ఎస్ కార్డులో ద్వారా కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం అందుతుందని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డ్ లో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు బాలకిషన్ రావు ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశము జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి వివరించడం జరిగిందని తెలిపారు. పెన్షనర్స్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పెన్షనర్స్ నుండి ఈ హెచ్ ఎస్ ప్రీమియం మే 2026 నుండి బేసిక్ పే 1.5 శాతం తగ్గింపబడి ట్రస్ట్ కు జమచేయబడుతుందనీ, 17-07-2026 నుండి క్యాష్లెస్ ట్రీట్మెంట్ మొదలైన నాటి నుండి వివిధ హాస్పిటల్స్ లో న్యాయమైన చికిత్స పొందుతున్నారు. అప్పటినుండి ట్రీట్మెంట్ ఖర్చుల అమౌంట్ బిల్స్ ఈహెచ్ సిటికు సమర్పిస్తే వారికి ఈ హెచ్ ఎస్ నుండి డబ్బులు చెల్లించాలని తెలిపారు. హెల్త్ కార్డ్స్ విషయం లో ఆదేశిస్తూ క్రొత్త హెల్త్ కార్డ్స్ వచ్చేవరకు,పాత కార్డ్స్ తో అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ చికిత్స అందచేయాలని, హైదరాబాద్ లోని హాస్పిటల్స్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి వైద్యం అందించటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. సర్వీస్ పెన్షనర్స్ యొక్క డిపెండెంట్స్,ఫ్యామిలీ పెన్షనర్స్ వారి ఎలిజిబుల్ ఉన్న క్రొత్త వారికి ఈ హెచ్ ఎస్ కార్డ్స్ కొరకు సంబంధిత ఎస్ టి ఓ/ ఏ టి ఓ/ డి టి ఓ కార్యాలములలో అవసరమైన సమాచారముతో అప్లై చేసుకొనుటకు అనుమతించారు. వారికి క్రొత్త కార్డ్స్ ఇవ్వాలి,క్రొత్త కార్డ్స్ వచ్చేవరకు పాత కార్డ్స్ తో చికిత్స అందచేయాలి. ఈ సంఘం టీఎస్ జిఆర్ఈఏ ప్రాతినిధ్యం మేరకు కర్నూల్ , విజయవాడ లలో ఎంప్యానెల్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుటకు చేర్చినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు బాలకిషన్ రావు, ఆర్థిక కార్యదర్శి బీసిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, సీనియర్ పెన్షనర్ హనుమంతు అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు

## 30 పడకల హాస్పిటల్ కి విముక్తి ఎప్పుడు..?

**రోగుల ఆర్తనాదాలు ప్రభుత్వానికి పట్టవా.. పిఎచ్ సి.లో సరిపడ డాక్టర్స్ లేక రోగులు కు తీవ్ర ఇబ్బదులు**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి**



అయిజ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజమండల కేంద్రంలోని పిఎచ్ సి. ప్రాంగణంలో నిర్మాణం పెండింగ్ లో ఉన్న 30 పడకల హాస్పటల్ ముందు అయిజ పట్టణ బిజెపి అధ్యక్షుడు తెలుగు నరసింహ, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అయిజ కు సమీపంలో 1000 కోట్లతో (కర్నూల్ నుండి రాయచూరు అంచనా) నిర్మాణం అవుతున్న భారత్ మాల రోడ్ ఈ హాస్పటల్ భూమిపూజ తర్వాత ప్రారభంమై దాదాపు పూర్తి అవుతుంది. అదేవిధంగా అలంపూర్ చౌరస్తా రోడ్ దగ్గర లేటుగా భూమిపూజ ఐన 100 పడుకల హాస్పటల్ కూడా పూర్తిఐ వైద్య సేవలు ప్రారభంమైనవి. కానీ ఎందుకు ఈ 30 పడకల హాస్పటల్ పూర్తి కావడం లేదని ప్రశ్నించారు. అయిజ మండల పట్టణ జనాబా లక్షకు పైగ ఉందని,రాష్ట్ర లో మిగితా ప్రాంతాలలో చిన్న చిన్న మండలాలలో 100 పడుకల హాస్పటల్స్ ఉన్నాయి. కాని మన పాలకుల నిర్లక్షం తో ఈ చిన్న 30 పడుకల హాస్పటల్ కూడా పూర్తి కావడం లేదని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు తగిన బుద్ధి చెబుతారు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం ఓ బి సి. మోర్చా ల జిల్లా అధ్యక్షులు బాబుల్ రెడ్డి,దేవదాసు,సమతా గద్వాల పట్టణ అధ్యక్షులురాలు రజకజయశ్రీ,సద్దాల కృష్ణ,పాండు తూముకుంట అంజి, దేవబండ రామకృష్ణ వర్మ,సాయి,సతీష్ ,శాంతి నగర్ అశోక్,పైపాడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ నర్సింగ్ కాలేజీ యాజమాన్య వేధింపులే "శ్రావ్య ఆత్మహత్య యత్నం"

**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ**

**-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**




రంగారెడ్డి జిల్లా బ్యూరో/అబ్దుల్లాపూర్ మేట్ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కళాశాలల నిర్వాహకులు కనీస వసతులు లేకుండా, అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండా నడుపుతున్న నేతాజీ నర్సింగ్ కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు శ్రావ్య అనే విద్యార్థినిని వేధింపులకి గురి చేయటం వలన ఆమె ఆత్మహత్య యత్నం చేసిందని ఆరోపిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి భారీ ఆందోళన, కళాశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. యాజమాన్యం వేధింపులకి నిరసనగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్ పేటలోని నేతాజీ నర్సింగ్ కాలేజీ ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు హాజరై కళాశాల యజమాన్యం పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు... అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతులు లేకుండా నడిపుతున్నాయని, వాటి దారిలోనే నేతాజీ నర్సింగ్ కాలేజీ కూడా ఉండాల్సిన కనీస వసతులు అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకులు లేకుండా నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని వారు అన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయమని అడిగిన శ్రావ్య అనే విద్యార్థినిని లక్ష్యంగా కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నిరంతరం వేధింపులకి గురించేయటం వలన ఆ అమ్మాయి జులై 12 నాడు కాలేజీ భవనం పైనుండి దూకి ఆత్మహత్య యత్నం చేసిందన్నారు. ఈ సంఘటనలో ఆమె రెండు కాళ్ళు పూర్తిగా విరిగిపోయాయని, ఇప్పటి వరకు కూడా కాలేజీ యాజమాన్యం అమ్మాయిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ఇతర ప్రాంతాల ఎమ్మెల్యల అనుచరులమని అమ్మాయి తల్లిదండ్రులకి ఫోన్ లు చేయించి బెదిరింపులకి గురిచేయటం దుర్మార్గమని అన్నారు. లక్షల ఫీజులు వాసులు చేసిన యాజమాన్యం వారి బాధ్యత మరిచి కనీసం మానవత్వం లేకుండా వైద్యం కూడా అందించలేదని మండిపడ్డారు. తక్షణమే కాళోజి నారాయణరావు యూనివర్సిటీ అధికారులు స్పందించి నేతాజీ నర్సింగ్ కాలేజీ అనుమతులని రద్దు చేసి కాలేజీ యాజమాన్యం పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు మీద ఎంతో ఆశతో కాలేజీకి వచ్చి యాజమాన్యం వేధింపుల కారణంగా తీవ్రంగా గాయపడి రెండు కాళ్ళు విరిగిన శ్రావ్య కి మెరుగైన వైద్యం అందించి ఆమెకి న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, మహిళా కో కన్వీనర్ పార్వతి, నిఖిల్, ఏఐవైఎఫ్ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షులు శోభన్ బాబు,ప్రధాన కార్యదర్శి గణేష్,ఉపాధ్యక్షులు ప్రవీణ్, సహాయ కార్యదర్శి చంటి, కోశాధికారి అశోక్, సత్యం, వెంకట దుర్గ ప్రసాద్, చందు, అరవింద్, సిపిఐ మెట్టు మండల కార్యవర్గ సభ్యులు పేరాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్స్ డీమార్ట్ ఎదురుగా..'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ప్రారంభం

**మహిళల ఆర్థిక సాధికారతకు మరింత బలం.. 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



అల్వాల్, ఆగస్టు 1, (విజన్ ఆంధ్ర):మహిళల ఆర్థిక సాధికారతకు 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'మరింత బలం చేకూరు స్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని కానాజిగూడ మెయిన్ రోడ్, గ్రీన్ ఫీల్డ్స్ డీమార్ట్ ఎదురుగా, శ్రీ దుర్గా మహిళా పొదుపు సంఘం నిర్వాహకులు లత, గౌతమి, జయలకు మంజూరైన "ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్" ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడు తూ, మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. మహి ళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుటుంబ ఆర్థికా భివృద్ధికి తోడ్పడే ఇలాంటి కార్యక్ర మాలు మరింత విస్తరించాలని, వీటిని అర్హులైన మహిళలు సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. క్యాంటీన్ నిర్వాహకులు మాట్లా డుతూ, ఈ క్యాంటీన్లో మిర్చి బజ్జి, పునుగులు, సమోసా, వడ, చపాతీ, టీ తదితర అల్పాహార పదార్థాలు ప్రజలకు అందు బాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటా పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, అల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, కమ్యూ నిటీ ఆర్గనైజర్ ప్రవీ ణ్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, వీరేశం, సయ్యద్ మోసిన్, తాజు ద్దీన్, సురేష్, మహమూద్, దేవేందర్, పవన్, రాజు, ఆశా, శంకర్, ప్రభాకర్, ప్రకాష్ గౌడ్, సుదర్శన్, ముత్యాలు, రాజ్‌కుమార్, కన్నా, సంపత్, స్థానికులు పాల్గొన్నారు

## పొలం దున్నుతుండగా మూర్ఛ వచ్చి...ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

మల్కాజిగిరి, ఆగస్ట్ 1, (విజన్ ఆంధ్ర): ట్రాక్టర్ కింద పడి ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటననంగునూరు మండలం ఘనాపూర్ లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గణాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బత్తుల బాపురాజు (39)పొలం దున్నుతుండగా మూర్ఛ రావడంతో అదుపుతప్పి,ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు,ఒక కుమార్తెఉ ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వంఆదుకోవాలనిస్థానికులు కోరారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ముగ్గురు జేబుదొంగలు అరెస్ట్, రిమాండ్

### బస్సు ఎక్కుతున్న వారినే టార్గెట్




ఎల్బీనగర్ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర): బస్సు ఎక్కే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు యువకులను నాగోల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక ఐఫోన్, ఒక మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 31న నాగోల్ చౌరస్తాలోని బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చగా, అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి, బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు వారి జేబుల్లోని రెండు సెల్‌ఫోన్లను అపహరించి పరారయ్యారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాగోల్ పోలీసులు ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 7 సెల్‌ఫోన్ చోరీ కేసులు, బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై 4 చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు.

## భారత్ మాల గట్టు మండల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గట్టు ఆగస్టు 01( విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం రాయపురం స్టేజ్ దగ్గర గట్టు మండలం భారత్ మాల అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు కొరకు 167 రోజులు దీక్ష చేసిన రాయపురం గ్రామస్తులకు దీక్షను విరమించి నిమ్మరసం ను అందజేసి భారత్ మాల రోడ్డు గట్టు మండలం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగద్వాల నియోజకవర్గంలో గట్టు మండలంలో భారత్ మాల రోడ్డు నిర్మాణం కావడంతో గట్టు మండలంలోని రాయపురం స్టేజి దగ్గర అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు మాజీ సింగల్ విండో చైర్మన్ రాముడు ఆధ్వర్యంలో గ్రామస్తులు 167 రోజులపాటు రిలే నిరాహార దీక్షను విరమింప చేయడం జరిగింది. గద్వాల నియోజకవర్గం గట్టు మండల అభివృద్ధి కొరకు ఈ ప్రాంతంలోని భారత్ మాల వంటి రహదారి నిర్మాణం పనులు కావడంతో ఈ ప్రాంతం నుండి మైసూర్ పూనే వరకు రోడ్డు నిర్మాణం ఇటు తమిళనాడు వరకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది, ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని దూరదృష్టతో ఆలోచించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ రోడ్డు నిర్మాణముకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో గట్టు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా నా వంతు సహాయశక్తుల కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు,పిఏసిఎస్. ఛైర్మెన్ వెంకటేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్, మాజీ సింగల్ విండో రాముడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్టీసీ- ఆటోలు వెనక్కి తీసుకోవాలి: బెజ్జాల కృష్ణమూర్తి




మల్కాజిగిరి, ఆగస్ట్ 1,(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్టీసీ ఆటోలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి రైల్వేస్టేషన్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఇకనైనా ఆర్టీసి ఆటో అమలు నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని, లేని పక్షంలో అన్ని జిల్లాలలో, అన్ని ఆటో స్టాండ్ లలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు కె.మహేందర్, సాయి, ఎండి ఆరిఫ్, ఎండి. రహ మాన్, శ్రీకాంత్, సాయికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## హరిబౌలి మహంకాళి ఆలయంలో ఘనంగా 78వ వార్షిక బోనాల ఉత్సవాలు

### అక్షిత అర్చన పూజలతో ప్రారంభం

### ఆకాష్, ఉజ్వల్ కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



హైదరాబాద్,ఆగస్ట్ 01,విజన్ ఆంధ్ర: తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో 78వ వార్షిక బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అక్షిత అర్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజలను ఆకాష్, ఉజ్వల్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమంగా జరిపారు. ఆలయ ప్రధాన పూజారి రవినారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య పూజలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. 78 సంవత్సరాలుగా నిర్విరామంగా జరుగుతున్న ఈ బోనాల ఉత్సవాలు తెలంగాణ ప్రజల ఆచారం, సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తి పాటలు, జయజయధ్వానాలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానికులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## వృద్ధులకు సేవలు అందించడం మానవత్వానికి నిదర్శనం

### వృద్ధాశ్రమాల నిర్వహణలో సేవాభావం సమాజానికి ఆదర్శం డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి..




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్టు 01, విజన్ ఆంధ్ర: సమాజంలో వృద్ధులను గౌరవించడం, వారికి ప్రేమతో సేవలు అందించడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఏ.శ్రీదేవి అన్నారు. వృద్ధాశ్రమ నిర్వహణలో సేవాభావంతో పనిచేయడం సమాజానికి నిజమైన ఆదర్శమని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో డీ.డబ్ల్యూ.ఓ మరియు ప్రజల భాగస్వామ్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, రోజువారీ అవసరాలు, జీవన పరిస్థితులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా న్యాయసేవల సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ వృద్ధులకు సురక్షితమైన, శాంతియుతమైన వాతావరణం కల్పించడం అత్యంత గొప్ప సేవ అని అన్నారు. నాణ్యమైన ఆహారం, సమయానుకూల వైద్య సేవలు, పరిశుభ్రమైన నివాస వసతులు అందించడం ద్వారా వృద్ధుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. వృద్ధులను కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం మన సంస్కృతిలో ఉన్న అత్యున్నత విలువ అని ఆమె గుర్తు చేశారు. తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం చూపడం ప్రతి కుటుంబ బాధ్యత అని శ్రీదేవి పేర్కొన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిరంతరం కృషి చేస్తుందని, అవసరమైన ప్రతి వృద్ధునికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పి. వెంకటయ్య, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పి. పద్మ, సిబ్బంది, వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు పాల్గొన్నారు...

## " సంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలలో బాలల అక్రమ రవాణాపై నిర్ణయాత్మక జాతీయ ప్రచారాన్ని ప్రారంభించిన స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్)"

సంగారెడ్డి / జనగామ / యాదాద్రి భువనగిరి, తెలంగాణ । 31 జూలై 2026ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా, తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలలో బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న గ్రామీణ స్వచ్ఛంద సంస్థ స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), న్యూఢిల్లీలో ప్రారంభమైన దేశవ్యాప్త "జాతీయ బాలల అక్రమ రవాణా నిరోధక ప్రచారం"లో భాగంగా జిల్లాస్థాయి సమగ్ర బాలల అక్రమ రవాణా నిరోధక ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. బాలలకు సురక్షితమైన జిల్లాలను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, బాలల సంక్షేమ సంస్థలు, పాఠశాలలు, సామాజిక సంస్థలతో సమన్వయంగా పనిచేస్తామని స్కోప్ సంస్థ స్పష్టం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా స్కోప్ సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలు:

గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం;

అక్రమ రవాణా ప్రమాదానికి గురయ్యే పేద, అట్టడుగు, అత్యంత అసురక్షిత కుటుంబాలను గుర్తించడం;

అర్హత కలిగిన కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ, సామాజిక రక్షణ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా ఆర్థిక అసురక్షిత పరిస్థితులను తగ్గించడం;

పిల్లలు చదువులో కొనసాగేందుకు పాఠశాల హాజరు, బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం;

గుర్తించబడిన అక్రమ రవాణాదారులు, వారి నెట్వర్క్‌పై చట్టపరమైన చర్యలు, సమన్వయ దాడులు చేపట్టడం;

రక్షించబడిన పిల్లలకు పునరావాసం, సమాజంలో గౌరవప్రదమైన పునఃస్థాపనకు సహాయం అందించడం.

ఈ ప్రకటన న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన నాలుగు రోజుల జాతీయ సదస్సు "బాలల హక్కులు, సామర్థ్యం, శ్రేయస్సు సాధన"లో స్కోప్ సంస్థ పాల్గొన్న అనంతరం వెలువడింది. ఈ సదస్సును జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ఆధ్వర్యంలో నిర్వహించగా, దేశంలోని 782 జిల్లాల నుండి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) అనేది బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, లైంగిక దోపిడీ నిర్మూలన కోసం పనిచేస్తున్న 250కు పైగా పౌర సమాజ సంస్థల జాతీయ వేదిక. 2030 నాటికి అక్రమ రవాణా రహిత భారతదేశాన్ని నిర్మించడం దీని ప్రధాన లక్ష్యం. స్కోప్, జె ఆర్ సి భాగస్వామ్య సంస్థగా గర్వంగా పనిచేస్తోంది. జె ఆర్ సి, పిల్లలపై జరిగే నేరాలపై ప్రపంచంలోనే అతిపెద్ద చట్టపరమైన కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సదస్సులో సమర్పించిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 2023 నుండి డిసెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా జె ఆర్ సి, దాని




భాగస్వామ్య సంస్థల సమిష్టి కృషి ద్వారా 1,22,516 మంది పిల్లలను అక్రమ రవాణా నుండి రక్షించగలిగారు. ఇది చట్టపరమైన చర్యలు, సమాజాధారిత జోక్యాల ప్రభావాన్ని స్పష్టంగా చూపుతోంది. సదస్సును కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్ ప్రారంభించారు. ఆమె బాలల రక్షణ దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన బాధ్యతలలో ఒకటని పేర్కొంటూ, పిల్లలను దోపిడీ నుండి రక్షించడంలో పౌర సమాజ సంస్థల పాత్రను ప్రశంసించారు. "ఒక్క పిల్లవాడి ప్రాణాన్ని కాపాడడం కూడా అత్యంత మహోన్నతమైన సేవ. అనేక చిన్నారులు అక్రమ రవాణాకు గురై తిరిగి తమ ఇళ్లకు చేరుకోలేకపోతున్నారు. అలాంటి పిల్లలు తమను రక్షించే వారిని ఎదురు చూస్తుంటారు. వారిని లైంగిక దోపిడీ నుండి రక్షించే స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు దేవదూతలతో సమానం" అని మంత్రి పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన స్కోప్ సంస్థ డైరెక్టర్ డా. బండి సాయన్న, భారతదేశంలో బాలల అక్రమ రవాణా పిల్లల భవిష్యత్తుకు అత్యంత తీవ్రమైన ముప్పుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. "ప్రభుత్వ గణాంకాల ప్రకారం సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారు; మరో ఐదుగురు పిల్లలు బలవంతపు కార్మికత్వంలోకి నెట్టబడుతున్నారు. ప్రతి గంటకు సుమారు పదకొండు మంది పిల్లలు అదృశ్యమవుతున్నారు; వారిలో చాలా మంది చివరకు అక్రమ రవాణా బారిన పడుతున్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం తరువాత మానవ అక్రమ రవాణా ప్రపంచంలో మూడవ అతిపెద్ద సంఘటిత నేరంగా మారింది. మహిళలు, పిల్లలే దీని ప్రధాన లక్ష్యాలు. వాణిజ్య లైంగిక దోపిడీ, బంధిత కార్మికత్వం, ఇతర దోపిడీ రూపాల ద్వారా అక్రమ రవాణాదారులు లాభాలు



పొందుతున్నారు. అసంఘటిత రంగంలో బాల కార్మికత్వం అక్రమ రవాణా యొక్క అత్యంత భయంకరమైన రూపాలలో ఒకటి" అని ఆయన తెలిపారు. డా. సాయన్న మాట్లాడుతూ, అక్రమ రవాణాదారులు చాలాసార్లు బయటి వ్యక్తులు కాకుండా స్థానిక సమాజాల్లో పరిచయం ఉన్న వ్యక్తులే ఉంటారని తెలిపారు. వారు పేద కుటుంబాల ఆర్థిక కష్టాలను ఆసరాగా తీసుకొని ఉద్యోగం, చదువు లేదా మంచి భవిష్యత్తు పేరుతో పిల్లలను మోసం చేసి బంధిత కార్మికత్వం, గృహ దాస్యము, ప్రమాదకర పనులు లేదా లైంగిక దోపిడీ వైపు నెట్టివేస్తారని ఆయన పేర్కొన్నారు. "మా ప్రధాన దృష్టి నివారణ, రక్షణ, నేరస్థులపై చట్టపరమైన చర్యలపై ఉంటుంది. ప్రభుత్వ శాఖలు, జిల్లా పరిపాలనతో కలిసి అసురక్షిత కుటుంబాలను గుర్తించి, సామాజిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసి, పిల్లలు చదువులో కొనసాగి అక్రమ రవాణాదారుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాము. అదే సమయంలో రక్షించబడిన పిల్లలకు చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, విద్యా మద్దతు, పునరావాసం, సమాజంలో గౌరవప్రదమైన పునఃస్థాపనను కల్పిస్తాము" అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పౌరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, సామాజిక నాయకులు, స్థానిక సంస్థలు బాలల భద్రత, విద్య కోసం ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని స్కోప్ సంస్థ పిలుపునిచ్చింది. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే అధికారులకు తెలియజేయడం, పేద, ప్రమాదంలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సంస్థ పేర్కొంది. చివరిగా, బాలల అక్రమ రవాణాను అరికట్టడం సమాజం మొత్తం పంచుకోవలసిన బాధ్యత అని, ప్రతి పిల్లవాడు భద్రత, గౌరవం, స్వేచ్ఛతో ఎదగాలంటే సమాజం, పౌర సమాజ సంస్థలు ప్రభుత్వ వ్యవస్థల మధ్య నిరంతర సహకారం అత్యంత అవసరమని స్కోప్ సంస్థ పునరుద్ఘాటించింది.

## గౌరవెల్లి, పాలమూరు ప్రాజెక్టులకు కొత్త ఊతం – సుప్రీం కీలక తీర్పు

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్...

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్టు 01, విజన్ ఆంధ్ర: గౌరవెల్లి ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ శనివారం సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పట్ల తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

**రాష్ట్ర ప్రయోజనాల కోసం బలమైన పోరాటం**

తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, అభిషేక్ స్వింగి వంటి ప్రముఖ న్యాయవాదులనులి నియమించి సుప్రీంకోర్టులో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు సాధ్యమైందని మంత్రి అన్నారు.

**లక్షల ఎకరాలకు లబ్ధి**

గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు లిపట్టణ, గ్రామీణ ప్రాంతాల తాగునీటి అవసరాలు కూడా



తీరతాయన్నారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని వివరించారు.

**తెలంగాణ హక్కుల విజయం**

తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి అభినందించారు. సుప్రీం తీర్పుతో రైతాంగంలో కొత్త ఆశలు చిగురించాయని, త్వరలోనే ప్రాజెక్టు పనులు వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం పర్యావరణ అనుమతులను నిలిపివేయడంతో నిలిచిపోయిన ఈ రెండు ప్రాజెక్టులు ఇప్పుడు సుప్రీం తీర్పుతో తిరిగి ముందుకు సాగేందుకు మార్గం సుగమైంది.

## ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ

### హైడ్రా పునరుద్దరణతో జలకళ



హైదరాబాద్,ఆగస్ట్1: ఒకప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీటితో కళ తప్పిన ఉప్పల్ నల్లచెరువు ఇప్పుడు వర్షపు నీటితో కళకళలాడుతోంది. హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మళ్లీ జీవం పోసుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి. పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పునరుద్ధరించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. చెరువు జలవ్యవస్థను బలోపేతం చేసేందుకు నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరేలా రెండు ఇన్‌లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఆధునిక ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు. జల సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాకింగ్ ట్రాక్, బలమైన ప్రధాన కట్ట, చిన్నారుల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చి విశ్రాంతి తీసుకునే నగరంలోని ప్రధాన వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిన హైడ్రా, ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో హైదరాబాద్‌కు మరో కీలక జలవనరుగా, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

### నీళ్లు మళ్లించే ఎపి కుట్రలు వేగమయ్యాయి

### టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ

హైదరాబాద్,ఆగస్ట్1): గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను



రద్దు చేయాలని ఆంధప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## ప్రతిభకు పదను పెడితే సాధ్యం కానిదేదీ లేదు

### కమ్యూనికేషన్ స్కిల్స్ ఎల్లవేళలా అవసరం నిరంతర అధ్యయనం తోనే ఉన్నతశిఖరాలకు చేరుకుంటాం బాసర విద్యార్థులతో మాజీ డిజిపి మహేందర్ రెడ్డి

బాసర,ఆగస్ట్1 గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెడితే సాధించలేనిది ఏదీ లేదని రాష్ట్ర మాజీ డీజీపీ కె. మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయంలో పీయూసీ నూతన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మహేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభకు సరైన దిశ చూపిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. జీవితంలో ఉన్నత విజయాలను సాధించాలంటే నిరంతర అధ్యయనం, కఠిన క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానానికే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భాషా ప్రావీణ్యం, సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి అంశంపై జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని అలవర్చుకుంటే విజయాన్ని సులభంగా చేరుకోవచ్చని చెప్పారు. తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న అనుభవాలు, కఠోర శ్రమ, పట్టుదల, నైతిక విలువలతో కూడిన జీవనశైలే తనను ఉన్నత స్థానానికి చేర్చాయని ఆయన గుర్తు చేసుకున్నారు.

# ముద్దుల పాపాయికి 'టీ' విషంతో సమానం!!

- మీ ప్రేమే వారి ప్రాణాలకు సంకటమా?
- డాక్టర్లు చెప్పిన్న షాకింగ్ నిజాలివే
- ఏళ్ల లోపు పిల్లలకు ఇస్తే ఏమవుతుందో తెలుసా?
- మీ బిడ్డ రక్తహీనతకు అసలు కారణం అదే కావచ్చు
- ప్రేమ పేరుతో పసిపిల్లలకు తాగించే ఒక్క గుటక టీ, కాఫీ వారి బంగారు భవిష్యత్తుకే పెద్ద ముప్పుగా మారుతోంది. డాక్టర్లు చెబుతున్న సత్యం ఇదే...

చదవండి... షేర్ చెయ్యండి... మీ కోసమే ఈ "విజన్ ఆంధ్ర" వార్తా కథనం.

హైదరాబాద్, ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర): మన ఇళ్లలో ఉదయం నిద్రలేవగానే మొదలయ్యేది టీ లేదా కాఫీ సువాసనతోనే. పెద్దవాళ్లకే కాదు, చిన్న పిల్లలు కూడా ఆ వాసనకు ఆకర్షితులవుతుంటారు. అమ్మమ్మలు, నానమ్మలు తమ ప్రేమనంతా కుమ్మరిస్తూ, "ఒక్క గుటక వేసుకోనాన్నా" అని చల్లారిన టీని పిల్లలకు తాగించడం మనం తరచుగా చూస్తుంటాం. కానీ, ఈ అమాయకపు ప్రేమ మీ బిడ్డల జీవితాలతో ఆడుకుంటోందని మీకు తెలుసా? డాక్టర్లు హెచ్చరిస్తున్న ఈ షాకింగ్ నిజాలను తెలుసుకోండి.

**ప్రేమ వెనుక పొంచి ఉన్న ముప్పు**

చిన్నారుల ఆరోగ్యంపై టీ, కాఫీలు ఎంత తీవ్రమైన ప్రభావం చూపుతాయో చిన్నారుల వైద్య నిపుణులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. 12 ఏళ్ల లోపు పిల్లలకు అసలు టీ లేదా కాఫీ ఇవ్వడం చాలా ప్రమాదకరమని అంటున్నారు. మనం ఇచ్చే ఆ ఒక్క గుటక వెనుక ఎన్నో ఆరోగ్య సమస్యలు దాగి ఉన్నాయని ఆయన వివరిస్తున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదాలు ఇవే**

**రక్తహీనత (ఎనీమియా)**

టీలో ఉండే టానిన్లు, కాఫీలో ఉండే కెఫిన్ పిల్లల శరీరంలో ఇనుము గ్రహించడాన్ని అడ్డుకుంటాయి. ఐరన్ లోపం వల్ల పిల్లల్లో తీవ్రమైన రక్తహీనత సమస్య తలెత్తవచ్చు. ఎర్ర రక్త కణాలు తగ్గిపోవడం వల్ల వారు నీరసంగా మారిపోతారు.




ఆకలి మందగించి చాలామంది పిల్లలు సరిగ్గా తినడం లేదని తల్లిదండ్రులు బాధపడుతుంటారు. దీనికి కారణం వారు తాగే టీ కాఫీలే కావచ్చు. ఈ పానీయాలు ఆకలిని చంపేస్తాయి, ఫలితంగా పిల్లలు సరైన పోషకాహారం తీసుకోవడానికి ఆసక్తి చూపరు.

**హైపర్ యాక్టివిటీ, నిద్రలేమి**

కెఫిన్ వల్ల పిల్లలు అదుపు లేని చురుకుదనం ప్రదర్శిస్తారు. ఇది వారి ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. అంతేకాకుండా, నిద్రలేమి సమస్య కూడా వస్తుంది. తగినంత నిద్ర లేకపోతే పిల్లల పెరుగుదల ఆగిపోతుంది. వారు మానసికంగా కూడా ఒత్తిడికి లోనవుతారు.

**తెలుసుకోవాల్సిన సత్యం**




**మన ప్రేమ, వారి ఆరోగ్యం**

మీ పాపాయి నోటి వరకు మీరు తీసుకెళ్తున్న ప్రతి టీ గుటక, వారి భవిష్యత్తు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోందన్నది చేదు నిజం. ప్రేమతో మీరు ఇచ్చేది పాల గ్లాసా లేక ప్రమాదకరమైన 'రసాయనాల' కలయికా అనేది ఆలోచించుకోండి. డాక్టర్లు సూచిస్తున్నట్లుగా మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. టీ, కాఫీలను పిల్లలకు దూరంగా పెట్టడం ద్వారా మాత్రమే మీరు వారికి సరైన ఆరోగ్యాన్ని అందించగలరు. ఈ అలవాటును ఇప్పుడే మార్చుకోండి, రేపటి ఆరోగ్యకరమైన తరాన్ని మనం అందిద్దాం.

- గద్దం సంతోష్ రాజ్
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

## ఆగస్టు 2న తెలంగాణలో 'నషా ముక్త యువ' సంకల్ప్ అభియాన్

- ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా యువతతో సంభాషణ..
- రాష్ట్రవ్యాప్తంగా ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలు




కుత్బుల్లాపూర్, జూలై 31 (విజన్ ఆంధ్ర): మాదకద్రవ్య రహిత భారతదేశం లక్ష్యంగా కేంద్ర యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ శాఖ ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ -- సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించనుంది. రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్‌తో పాటు మరో ఐదు జిల్లాల్లో యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో సామూహిక ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా కేంద్రాల్లో ఒక కోటి మందికి పైగా యువతతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా సంభాషించి 'నషా ముక్త యువ ప్రతిజ్ఞ' చేయించనున్నారు. ఈ సందర్భంగా మై భారత్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ చి. అన్వేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రతి విద్యాసంస్థ, ప్రభుత్వ శాఖ, సామాజిక సంస్థ ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యువశక్తి భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్--2047 లక్ష్య సాధన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

- ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం
- తల్లులు, కుటుంబ సభ్యులు చురుకుగా పాల్గొనాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ పిలుపు




కుత్బుల్లాపూర్, ఆగస్టు 2 (విజన్ ఆంధ్ర): శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది "జీవితానికి సుస్థిరమైన ప్రారంభానికి తల్లిపాలు -- ఫలితాలిచ్చే కార్యక్రమాలను మరింత బలోపేతం చేద్దాం" అనే నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన సదస్సులు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. పుట్టిన శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని అధికారులు తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని, తల్లి--బిడ్డ అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులు ఈ వారోత్సవాల్లో భాగస్వాములై తల్లిపాల ప్రాధాన్యాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

## వృద్ధులకు సేవలు అందించడం మానవత్వానికి నిదర్శనం

- వృద్ధాశ్రమాల నిర్వహణలో సేవాభావం సమాజానికి ఆదర్శం
- డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి..



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్టు 01, విజన్ ఆంధ్ర: సమాజంలో వృద్ధులను గౌరవించడం, వారికి ప్రేమతో సేవలు అందించడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఏ.శ్రీదేవి అన్నారు. వృద్ధాశ్రమ నిర్వహణలో సేవాభావంతో పనిచేయడం సమాజానికి నిజమైన ఆదర్శమని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో డీ.ఉ్మ.ఓ మరియు ప్రజల భాగస్వామ్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, రోజువారీ అవసరాలు, జీవన పరిస్థితులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా న్యాయసేవల సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ వృద్ధులకు సురక్షితమైన, శాంతియుతమైన వాతావరణం కల్పించడం అత్యంత గొప్ప సేవ అని అన్నారు. నాణ్యమైన ఆహారం, సమయానుకూల వైద్య సేవలు, పరిశుభ్రమైన నివాస వసతులు అందించడం ద్వారా వృద్ధుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. వృద్ధులను కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం మన సంస్కృతిలో ఉన్న అత్యున్నత విలువ అని ఆమె గుర్తు చేశారు. తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం చూపడం ప్రతి కుటుంబ బాధ్యత అని శ్రీదేవి పేర్కొన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిరంతరం కృషి చేస్తుందని, అవసరమైన ప్రతి వ్యక్తికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పి. వెంకటయ్య, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పి. పద్మ, సిబ్బంది, వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ల దందా......

- ఇంటి నెంబర్ ఇచ్చింది కార్యదర్శి? నంటా.....తెలుసా.....?
- ఎవరు ఏంచేస్తారో చూస్తా... అంటూ ఓ మాజీ...జులుం అంటా...
- భర్త భూమి భార్య పేరిట మాయం.. ముల్కనూర్‌లో "నకిలీ" లీలలు!
- లేని జిల్లా.. నకిలీ ముద్రలు: ముల్కనూర్ భూ దందా బయటపెట్టిన మాజీ ఉప సర్పంచ్!
- ఒకే స్థలం.. రెండు రిజిస్ట్రేషన్లు! ముల్కనూర్‌లో భూ మాయాజాలం!
- రిజిస్ట్రేషన్ల "భోజనం".. పంచాయతీ "ముద్ర" గందరగోళం: ముల్కనూర్ భూ వ్యవహారంపై రగడ!



భీమదేవరపల్లి, ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర): రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల ఉదాసీనతో, గ్రామపంచాయతీ రికార్డుల గందరగోళమో తెలీదు కానీ.. హక్కుదారు ఒకరైతే, మార్పిడి మరొకరి పేరిట జరిగిపోయింది! లేని జిల్లా ముద్రలతో పాత అనుమతులు వెలుగులోకి వచ్చాయి. ముల్కనూర్ గ్రామపంచాయతీ పరిధిలో వెలుగుచూసిన ఈ భూ వ్యవహారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

**?వివరాల్లోకి వెళ్తే..**

ముల్కనూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 856కు సంబంధించిన భూమి, గృహ నిర్మాణ అనుమతులు మరియు పంచాయతీ రికార్డుల్లో భారీగా వ్యత్యాసాలు ఉన్నాయని మాజీ ఉప సర్పంచ్ కొలుగూరి రాజు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు వినతిపత్రం అందజేశారు.

**అనుమానాల పుట్ట.. అసలు ఏం జరిగింది?**

ప్రభుత్వ రికార్డుల ప్రకారం 2011 డిసెంబర్ 20న గిఫ్ట్ డీడ్ ద్వారా ఈ భూమి 'మాదుగుల కొమురయ్య' పేరిట నమోదైంది. అయితే, భర్త హక్కులో ఉన్న భూమికి సంబంధించి ఆయన భార్య 'మాదుగుల లక్ష్మి' పేరిట 2024 ఏప్రిల్ 26న రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నం. 1808/2024) ఎలా జరిగిందనేది పెద్ద ప్రశ్నగా మారింది. నిబంధనల ప్రకారం అసలు యజమాని హక్కులను పక్కనబెట్టి వేరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఏ శక్తులు ఉన్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**లేని జిల్లా ముద్రలతో అనుమతులు!**

ఈ వ్యవహారంలో పంచాయతీ అనుమతుల పత్రాలు కూడా తీవ్ర వివాదాస్పదంగా మారాయి. 2015-16 కాలానికి చెందినవిగా చూపుతున్న గృహ నిర్మాణ అనుమతి పత్రాలపై అప్పట్లో ఉనికిలోనే లేని "వరంగల్ అర్బన్ జిల్లా" ముద్రలు ఉండటం అధికారుల వైఖల్యాన్ని, రికార్డుల ట్యాంపరింగ్‌ను స్పష్టం చేస్తోందని కొలుగూరి రాజు విమర్శించారు. అంతేకాకుండా 2016, 2017 నాటి అనుమతి పత్రాలు, ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ రికార్డులతో పాటు స్థల విస్తీర్ణం, హద్దుల్లో కూడా తీవ్రమైన వైరుధ్యాలు ఉన్నాయని వేలెత్తి చూపారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

పట్టాదారు పాస్‌బుక్, రెవెన్యూ రికార్డులు, గ్రామపంచాయతీ అనుమతి పత్రాలు, ఇంటి పన్ను రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని ల్యాండ్ సర్వే నిర్వహించాలని కొలుగూరి రాజు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, రికార్డులను సృష్టించిన వారిపై, సహకరించిన అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామీణ మార్కెట్( సంత) సముదాయం షాప్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



మల్దకల్ ఆగస్టు 01 (విజన్ ఆంధ్ర బ్యూరో): గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం కేంద్రంలో నాబార్డ్ వారి చే 20 లక్షల వ్యయం తో నిర్మాణమైన గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయం షాప్ ల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు హాజరయ్యారు.గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయపు షాప్ లను ఎమ్మెల్యే,జిల్లా అదనపు కలెక్టర్ తో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషించాలి...


- సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ
- ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 1,(విజన్ ఆంధ్ర): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన 5 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాలానుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. శిక్షణా కార్యక్రమాలలో పొందిన విజ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకువచ్చి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని, ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసేలా బోధించాలని తెలిపారు. విద్యార్థులలో పఠనం, రచన, గణిత నైపుణ్యాలతో పాటు విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా బోధనా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధే ఉపాధ్యాయుల లక్ష్యంగా ఉండాలని, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలను అనుసరించడం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా ప్రమాణాలు పెంపు కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతం చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు సమర్థవంతమైన బోధనా నైపుణ్యాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానాలు, నూతన విద్యా పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జాదవ్ అంబాజీ, ఉప విద్యాధికారి గోడం చందన్, పి.ఎం.ఆర్.సి. ఎ.పి.ఎం.ఓ. పూర్వ ఉద్ధవ్, మంచిర్యాల ఎ.పి.ఎం.ఓ. లక్ష్మయ్య, జి.సి.డి.ఓ.కొప్పుల శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాధవి శేఖ, కోర్సు డైరెక్టర్ కోడెం రవీందర్, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, శిక్షణ సమన్వయకర్తలు, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన వివిధ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుపేద వీధి వ్యాపారులకు ఊరట... తాత్కాలికంగా కూల్చివేతలకు బ్రేక్

- టీఎస్ఐఐసీ కాలనీ నుంచి రాజీవ్ గాంధీ నగర్ వరకు టౌన్ ప్లానింగ్ చర్యలు
- ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేతలపై వ్యాపారుల ఆవేదన
- సంఘటన స్థలానికి చేరుకుని అధికారులను నిలదీసిన పుప్పాల భాస్కర్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి సమస్య.. రెండు వారాల గడువు కోరిన నాయకులు
- బోనాల ఉత్సవాల నేపథ్యంలో జీవనోపాధికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- ఎమ్మెల్యే జోక్యంతో తాత్కాలికంగా కూల్చివేతలు నిలిపివేసిన అధికారులు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 1 (విజన్ ఆంధ్ర): ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద వీధి వ్యాపారుల జీవనాధారంపై ప్రభుత్వ చర్యలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా వ్యాపార సముదాయాలను తొలగించడం పేద కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. శనివారం ఉదయం టీఎస్ఐఐసీ కాలనీ నుంచి రాజీవ్ గాంధీ నగర్ వరకు రోడ్డు పక్కన ఉన్న వీధి వ్యాపార సముదాయాలను సి.ఎం.సి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న సి.ఎం.సి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. ముందస్తు నోటీసులు లేకుండా పేదల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సమంజసం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఈ అంశాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీసం రెండు వారాల పాటు కూల్చివేతలను నిలిపివేసి, వీధి వ్యాపారులు తమ జీవనోపాధిని కొనసాగించుకునేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద టౌన్ ప్లానింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా కూల్చివేతలను నిలిపివేయాలని సూచించడంతో అధికారులు తమ చర్యలను నిలిపివేశారు. దీంతో అక్కడి వీధి వ్యాపారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, ఇస్మాయిల్, జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వీధి వ్యాపారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ఆపరేషన్ ముస్కాన్ లో 119 మంది బాలలకు విముక్తి.

**- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**




నిజామాబాద్ ఆగస్టు01:( విజన్ ఆంధ్ర) : నెల రోజుల వ్యవధిలో కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ XII" లో 119 మంది బాలలకు విముక్తి కల్పించినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. జూలై 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఆపరేషన్ ముస్కాన్ కొనసాగిందన్నారు.ఈ ఆపరేషన్ ముస్కాన్ ముఖ్య ఉద్దేశ్యం 18 సంవత్సరాల లోపు అపహరించబడిన, తప్పిపోయిన,కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షణలోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించడం జరిగిందని సీపీ తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి.డబ్ల్యూ.సి) కి అప్పగించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఉన్న పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచి , వారి ఆదేశాల మేరకు తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ ×× లో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గల నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్లలో మొత్తం 119 మంది మగ పిల్లలను గుర్తించామన్నారు. ఈ ఆపరేషన్ లో భాగంగా నిజామాబాద్ డివిజన్ పరిధిలో 19 ఎఫ్.ఐ.ఆర్‌లు,ఆర్మూర్ డివిజన్ పరిధిలో 15,బోధన్ డివిజన్ పరిధిలో 14 కలిపి మొత్తం 48 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు చేశామన్నారు.అలాగే తప్పిపోయిన పిల్లల వివరాలను "ట్రాక్ చైల్డ్" లో నమోదు చేసి వారి ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నమన్నారు.ఈ ఆపరేషన్ ముస్కాన్ ×× లో పట్టుకున్న పిల్లల వివరాలు సబ్ డివిజన్ వారీగా గుర్తించిన బాలల వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 43 మంది బాలలను, బోధన్ సబ్ డివిజన్ పరిధిలో 49 మంది బాలలను, ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలో 27 మంది బాలలను గుర్తించడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు.

## మల్లంపల్లి రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి సాయం.

**- 25 కిలోల బియ్యం అందజేసిన దిడ్డి రాజ్ కుమార్**



ములుగు జూలై 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మల్లంపల్లి వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మరణించిన ములుగు ప్రేంనగర్ వాసి కీ.శే. కొమ్మినేని సమ్మయ్య కుటుంబాన్ని ములుగు జిల్లా పెరక సంఘం ఉపాధ్యక్షుడు దిడ్డి రాజ్ కుమార్ పరామర్శించారు. వారికి అండగా 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం నుండి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, 19వ వార్డు కౌన్సిలర్ పొదల ఓంప్రకాష్, ములుగు మంజునాథపురం అధ్యక్షుడు వేములపల్లి రాజు, కోశాధికారి సభావత్ రమేష్, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల బిక్షపతి, ములుగు-భూపాలపల్లి జిల్లా సహ కార్యవర్గ సభ్యుడు ముక్కు సుబ్బారెడ్డి, శారీరక ప్రముఖ్ భాషబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు అమృతంతో సమానం

**- డి ఎం హెచ్ ఓ డాక్టర్ గోపాల్ రావు.**


**- ములుగులో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం.**



ములుగు జూలై 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి డి ఎం హెచ్ ఓ డాక్టర్ గోపాల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "నా బిడ్డకు – నా పాలనే ఇస్తాను" అనే భావనతో తల్లులు తమ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు అమృతంతో సమానమని, ప్రసవం అయిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇరువురికీ ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం థీమ్ "తల్లిపాలు – మొదటి స్థిరమైన ఆహారం" అని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు, గర్భనిరోధకంగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. జి జి హెచ్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనిల్ తల్లులు బిడ్డలకు పాలు ఇచ్చే సరైన పద్ధతులు, టెక్నిక్స్ గురించి వివరించారు. జిల్లా శిశు ఆరోగ్యం , టీకాల అధికారి డాక్టర్ నాగనేష్ మాట్లాడుతూ, ఈ వారం రోజుల పాటు అన్ని పీహెచ్సీ లలో, అంగన్వాడీ కేంద్రాలలో, ఏ ఎన్ సీ క్లినిక్లలో గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాతా సంరక్షణ అధికారి డాక్టర్ శ్రీకాంత్, మాస్ మీడియా అధికారి సంపత్, జి జి హెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ ఆఫీసర్లు, మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాలిచ్చే తల్లులు పాల్గొన్నారు.

## గోదావరి వరద ప్రాంతాలను పరిశీలించిన మంత్రి సీతక్క.

**- 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు**



ములుగు జూలై 28 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం మంగపేటను సందర్శించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి గోదావరి వరద ప్రవాహాన్ని, జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. వరద ముంపు బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల నుండి 28 కుటుంబాలకు చెందిన 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సహాయక చర్యలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్యం, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముంపు బాధితులకు శాశ్వతంగా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్ తోట రవీందర్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నాం

**- వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం: మంత్రి సీతక్క**



ములుగు ఆగస్ట్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శనివారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని లిరామన్నగూడెం పుష్కర ఘాట్‌లి వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని మంత్రి సీతక్క, లిజిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోలిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండు రోజులుగా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉప్పొంగుతుందని, జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పీవో, సాగునీటి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించామని వివరించారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో 800 మీటర్ల మేర కరకట్ట పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు వరద సమయంలో వాగులు దాటవద్దని, వర్షాల్లో అడవులకు, చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లోని పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం.పి.డి.ఓ తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**- వరద నీటి చేరికపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష**



నిజామాబాద్, ఆగస్టు 01 :( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ను శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐ.టీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని (ఇన్ ఫ్లో) పరిశీలించారు. రిజర్వాయర్లో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టుకు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువన గల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు కడెం తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు, 80 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నం సమయానికి 85వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి ఆయకట్టు పంటలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలని అన్న విషయమై రెండు మూడు రోజులలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయితే, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే ఎస్సారెస్పీలో ఈసారి కొంత తక్కువ మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్ లో 38 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 27 టీఎంసీలకే పరిమితం అయ్యిందన్నారు. నిజానికి 112 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించబడిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సారెస్పీ లో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయమై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులు దశాబ్దాల కాలంగా చెక్కు చెదరకుండా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో 2019 లో నిర్మించిన మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలు మాత్రం 2022 నాటికే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆక్షేపించారు. వీటి అవసరం లేకుండానే ఎల్లంపల్లి రిజర్వాయర్ లోకి 20 టీఎంసీ ల నీరు వచ్చి చేరిందని అన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పై బ్యారేజీలలో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారని, అన్ని విషయాలను శాస్త్రీయంగా, సాంకేతికపరంగా సమగ్ర పరిశీలన జరిపి మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటీవల ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల సంఘం సమావేశాల్లోనూ ఏకీభవించడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆక్షేపించారు. మేడిగడ్డ పంప్ హౌజ్ ల ద్వారా గత ప్రభుత్వం 60 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే ఒక్క కరెంట్ బిల్లు రూపంలోనే 3వేల కోట్ల రూపాయల ఛార్జీలు అయ్యాయని అన్నారు. పంప్ హౌజ్ ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రజాధనం వృధా చేసిన వారే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీ.ఈ సునితాదేవి తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రామవరం అభివృద్ధికి ప్రాధాన్యం..

**- డ్రైనేజీ, రోడ్లు, సూపర్ బజార్ స్థలం పరిశీలన..**

**- మిషన్ భగీరథ పనులపై ఆగ్రహం**

**- ఆక్రమణలపై కఠిన చర్యలకు సిద్ధం**

**- రామవరంలో విస్తృతంగా కమిషనర్ పర్యటన**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 02(విజన్ ఆంధ్ర) : రామవరం ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ సుజాత శనివారం




విస్తృతంగా పర్యటించారు. 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మతో కలిసి కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు.ముందుగా 15, 16 డివిజన్లలో ఇటీవల ప్రారంభమైన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్, నాణ్యతలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, అభివృద్ధి పనులకు స్థానిక ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.అనంతరం 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ విజ్ఞప్తి మేరకు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రామవరం సూపర్ బజార్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పేరుకుపోయిన చెత్త, పొదలను తొలగించి స్థలాన్ని పూర్తిగా శుభ్రం చేసి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన చర్యలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న రహదారులను కూడా కమిషనర్ పరిశీలించారు. పైప్‌లైన్ పనులు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వివరించగా, సంబంధిత శాఖ అధికారులను వెంటనే పిలిపించి పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తైన వెంటనే రహదారుల పునర్నిర్మాణం చేపట్టి మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.16వ డివిజన్‌లో ఆక్రమణలకు గురైన రహదారులను పరిశీలించిన కమిషనర్, పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.పర్యటన సందర్భంగా కమిషనర్ సుజాత మాట్లాడుతూ, రామవరం ప్రాంతంలో డ్రైనేజీ, రోడ్లు, ప్రభుత్వ స్థలాల అభివృద్ధి, ఆక్రమణల తొలగింపు వంటి పనులను దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో డీఈవై నరేష్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్, ప్రియాంక, సీపీఐ నాయకుడు మునిగడప వెంకన్న, రామవరం పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ ముస్తఫా, వ్యాపారవేత్త నజీర్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరద శాంతించాలని మంత్రి సీతక్క ప్రత్యేక పూజ.

**- దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలన**



ములుగు ఆగస్టు 1 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోదావరి నదిలో వరద పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం వాజేడు మండలంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోలతో కలిసి వాజేడు మండలం ముళ్ళకట్ట – పూసూరు వంతెన వద్దకు చేరుకున్న మంత్రి గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించి, నది శాంతించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చీకుపల్లి – పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు వంతెన వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గోదావరి వరద ప్రవాహంపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బ్యాక్‌వాటర్ ప్రభావంతో గ్రామాలు ముంపునకు గురైతే బాధితులను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం.పి.డి.ఓ తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా జవహర్ నగర్ కాలనీలో మొక్కలు పంపిణీ



మల్కాజిగిరి, ఆగస్ట్ 1, (విజన్ ఆంధ్ర): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్లో మల్కాజ్గిరి డిసి జకియా సుల్తానా, డివిజన్ మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ కాలనీలో మొక్కలు నాటి పచ్చదనం పెంపుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్ రావు, హార్టికల్చర్ వెంకటేష్, జవహర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసి యేషన్ సభ్యులు నారా యణ, జాన్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కాశి రెడ్డి, శ్రీశైలం,మాధవి, పద్మావతి, మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు

## సామూహిక వివాహ మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మల్కాజిగిరి, ఆగస్ట్ 1, (విజన్ ఆంధ్ర): సమాజ సేవే లక్ష్యంగా వికలాంగులు మరియు పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందిం చిన సామూహిక వివాహ మహోత్సవాల పోస్టర్‌ను శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడు తూ, వివాహం ప్రతి కుటుంబ జీవితంలో అత్యంత పవిత్రమైన ఘట్టమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లల వివాహాలను జరపలేక ఇబ్బందులు పడుతున్న వికలాంగులు, పేదల కుటుంబాలకు రూపాయి ఫౌండేషన్ అందిస్తున్న సహాయం ఎంతో గొప్పదని కొనియా డారు. సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న నిర్వాహ కులను ఆయన అభినం దించారు. సమాజంలో సేవా భావం కలిగిన ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్ర మాలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా పేద, వికలాంగుల జీవితా ల్లో ఆనందాన్ని నింపే సామూహిక వివాహాలు సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. రూపా యి ఫౌండేషన్ చేపడు తున్న ఈ కార్యక్రమం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.వికలాంగుల హక్కుల సాధన సమితి లక్ష్మి గార్డెన్స్, చంపాపేట్ ఆధ్వర్యంలో నవంబర్ 18 న నిర్వహించనున్నసామూహిక వివాహ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వాహకులు నాగమల్ల అనిల్ కుమార్ – అరుణ, గుత్తికొండ కిరణ్ – లక్ష్మి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 50 వికలాంగులు మరియు నిరుపేద జంట లకు ఈ సామూహిక వివాహ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివాహానికి అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు వధూవరులకు అవసర మైన సామగ్రిని కూడా అందించనున్నట్లు వెల్ల డించారు. సమాజం లోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- బాధితులను పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**



నిజామాబాద్ ఆగస్టు01: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. శనివారం 42వ డివిజన్లోని చంద్రశేఖర్ కాలనీలో ఇవల ఎడతెరిపిలేని వర్షం కారణంగా షేక్ ఫిరోజ్ ఇళ్లు కూలిపోవడంతో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వర్షం కారణంగా ఇబ్బందులు ఏర్పడితే అధికారులకు, స్థానిక కార్పొరేటర్లకు సంప్రదించాలని కోరారు. సంబంధిత అధికారులు సైతం లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అనంతరం నెలవారి నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బెల్లాల్ శశాంక్, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఊర పండగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదు

**- నగర మేయర్ ఉమారాణి**



నిజామాబాద్ ఆగస్టు 01:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్న సంప్రదాయ ఊరపండుగ ఏర్పాట్లకు సంబంధించి నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మరియు సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఊరేగింపు మార్గాల్లో మరియు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా ఉండాలని, వేడుకల సందర్భంగా ప్రధాన మార్గాలు, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, ఊరేగింపు సాగే దారుల్లో వీధి దీపాలు (రాజుణ) అన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. భక్తులు మరియు ఊరేగింపు వెళ్లే మార్గాల్లో గుంతలను పూడ్చి, రోడ్లను సుగమం చేయాలని అధికారులకు ప్రతిపాదించారు. పండుగ నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, రక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, హెల్త్ క్యాంపులను సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద తాగునీటి చలివేంద్రాలు, నీడ కొరకు షామియానాలు ఏర్పాటు చేయనున్నారు.

నాయకులు & కమిటీ సందేశం

నగర శాంతిభద్రతలకు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ ఊరపండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని; కార్పొరేషన్ యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు పండుగ ముగిసే వరకు పూర్తి సహకారాన్ని అందిస్తారని ఈ సందర్భంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్, సానిటరీ సిబ్బంది, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, కోఆప్షన్ మెంబెర్ నరేందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, బంటుబలరాం, ఆమ రాజు, లవంగ ప్రమోద్,అవీన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఊర పండుగకు సర్వం సిద్ధం.

**- సీసీ కెమెరాల నిఘాలో భారీ బందోబస్తు.**

**- ఏర్పట్లను పరిశీలించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**



నిజామాబాద్ ఆగస్టు01:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించనున్న ఊర పండుగకు సర్వం సిద్ధమైంది. ఇందూర్ సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఊరు పండుగ ఏర్పాట్లను చేపట్టారు. ఆషాడ మాసంలో నిర్వహించనున్న ఊర పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అమ్మవారి విగ్రహాలను తయారు చేశారు. గత ఏడాది నిర్వహించిన ఏర్పాట్లలో భారీ యాత్రలో భాగంగా లాటి చార్జి జరిగిన విషయం విధితమే.



ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది. బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శుక్రవారం పరిశీలించారు. అమ్మ వార్ల విగ్రహల ఊరేగింపు జరిగే ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం భారీగా పోలీస్ బలగాలను మోహరించినన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీపీ సాయి చైతన్య ప్రత్యేక పర్యవేక్షణ చేయనున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఊర పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిల్వనున్నాయి. శనివారం అర్ధరాత్రి ఊర పండుగ జరిగే ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. గోదావరి జలాలతో తీసుకువచ్చి అమ్మవార్ల విగ్రహాలకు జలాభిషేకం చేయడంతో ఊర పండుగ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గత మూడు రోజులుగా అమ్మవార్ల విగ్రహాలను తయారు చేయడంతో పాటు, గురువారం రోజు బండారు ప్రక్రియను పూర్తి చేశారు. ఖిల్లా రఘునాథ ఆలయం నుండి అమ్మవారి రా విగ్రహాల ఊరేగింపు ప్రారంభించి నగరంలోని ప్రధాన వీధుల గుండా యాత్ర కొనసాగుతుంది. ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల విన్యాసాలతో పాటు కోళ్లను, మేకలను, నైవేద్య ప్రసాదాలుగా అమ్మవారికి ప్రసాదిస్తారు. ఖిల్లా చౌరస్తా వద్ద తేలు మైసమ్మ ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాలకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభిస్తారు. అదేవిధంగా వినాయక్ నగర్ లోని ఐదు చేతుల పోచమ్మ, దుబ్బ ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం, మత్తడి పోచమ్మ, మహాలక్ష్మి నగర్లోని మహా లక్ష్మమ్మ,, కోట గల్లీలోని సారలమ్మ ఆలయాల వద్ద ఊరేగించిన విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. పండగను పురస్కరించుకొని తొక్కిసలాట జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసేందుకు కార్యచరణ రూపొందించారు. గత ఏడాది సరి ప్రక్రియలో భాగంగా వివేకానంద విగ్రహం వద్ద తొక్కిసలాట జరగడంతో పోలీసులు స్వల్ప లాఠిచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఈసారి అలాంటి పరిస్థితి ఎదురవకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారి విగ్రహాల ఊరేగింపు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వ సమాజ్ కమిటీ సన్నాహాలు చేపట్టింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా శుక్రవారం అమ్మవారి విగ్రహాలను దర్శించుకొని, ఊరేగింపు జరిగే రూట్ మ్యాప్ ను పరిశీలించారు.సర్వ సమాజ్ కమిటీ కో కన్వీనర్ అదే ప్రవీణ్, రామర్తి గంగాధర్,యెశీడల లక్ష్మీనారాయణ, బంటు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

# భక్తి శిఖరాలకు చేరిన 91వ విశ్వశాంతి మహాయాగం

**- విద్యార్థుల నృత్యాలు, మహిళల కుంకుమార్చన, అన్నదానంతో పుణ్యక్షేత్రంగా మారిన కల్వకుర్తి...**






కల్వకుర్తి,ఆగస్టు 01, విజన్ ఆంధ్ర: దైవచింతనతోనే సమాజంలో సౌహార్దం, శాంతి నెలకొంటాయని నాగర్కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ విశ్వశాంతి మహాయాగంలో శనివారం ఆయన పాల్గొని యాగశాలను దర్శించారు.యాగం ప్రారంభమైనప్పటి నుంచే కల్వకుర్తి పట్టణం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతోంది. యాగశాల ఆవరణ మొత్తం ఒక ప్రసిద్ధ దేవాలయాన్ని తలపిస్తోంది. ప్రతిరోజు వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు, హోమాల్లో పాల్గొంటున్నారు.

**విద్యార్థులు, మహిళలతో సందడి**

ఈ యాగంలో కల్వకుర్తి పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. భక్తి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసి వాతావరణాన్ని భక్తిపారవశ్యంతో నింపుతున్నారు. అదేవిధంగా మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొంటూ అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటున్నారు. వారి భక్తి ప్రవత్తులతో యాగశాల మరింత పవిత్రంగా మారింది.

**అన్నదానం, ఊరేగింపు**

యాగంలో భాగంగా ప్రతిరోజు వేల మందికి అన్నప్రసాద వితరణ జరుగుతోంది. "అన్నదానం సమానం లేదు" అన్నట్టు భక్తుల ఆకలి తీరుస్తూ సేవాభావాన్ని చాటుతున్నారు. శనివారం యాగం సందర్భంగా పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. వేదమంత్రాల నినాదాలు, భజనలతో ఊరంతా మారుమోగింది. ఎంపీ ఏమన్నారంటే



ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రకృతి సమతుల్యత నెలకొనాలనే సంకల్పంతో ఈ మహాయాగం జరుగుతోందని అన్నారు. దైవానుగ్రహంతోనే జీవిత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, భక్తి, ధర్మం, సేవాభావం మనిషిని ఉన్నత స్థాయికి చేర్చుతాయని వివరించారు. యజ్ఞాలు ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, పాడిపంటల సమృద్ధి, దేశాభివృద్ధికి దోహదపడే భారతీయ సంస్కృతిలో అత్యున్నత ఆధ్యాత్మిక సంప్రదాయమని పేర్కొన్నారు.

**వైభవంగా సీతారామ కళ్యాణం**

ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణ కాలచక్రం, విష్ణు పంచాయతనం, ఆయుత చండీ, అతిరుద్ర హోమాలతో పాటు వివిధ దైవ కళ్యాణాలను ఒకేచోట నిర్వహించడం విశేషమన్నారు. వేకువజామున నవగ్రహ, నక్షత్ర, సరస్వతి పూజలు, వేదపారాయణాలు, జపాలు, హోమాలు, శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహ విశేష హోమాలు జరిగాయి. సాయంత్రం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వేదపండితుల వేదఘోషల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది.

**పాల్గొన్న ప్రముఖులు**

మున్సిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్కుమార్ దంపతులు, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, కాయతి విజయ్కుమార్ రెడ్డి, జూలూరు రమేష్బాబు, ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఇరుకుల రామకృష్ణ, గణేష్, చింతల రవి, ముచ్చర్లపల్లి జనార్దన్ రెడ్డి తదితరులు హోమంలో పాల్గొన్నారు. యాగ నిర్వాహకులు బీచని బాలకృష్ణ, మాచిపెద్ది రామస్వామి, జూలూరు ప్రకాష్, పోల సురేందర్, మురళి,రమణ,కల్వ మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.

**యజ్ఞాల విశిష్టత**

వేద సంప్రదాయం ప్రకారం యజ్ఞాలు, హోమాలు సమృద్ధిగా వర్షాలు, మంచి పంటలు, ప్రజారోగ్యం, ప్రకృతి సమతుల్యత, విశ్వశాంతి కోసం నిర్వహిస్తారు. మనిషిలో సాత్విక గుణాలు, సేవాభావం, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్ర కార్యక్రమాలుగా వీటిని భావిస్తారు. ఈ కారణంగానే దేశం, సమాజం, ప్రకృతి, మానవాళి శ్రేయస్సు కోసం నిర్వహించే విశ్వశాంతి మహాయాగంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకుని దీనిని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ యాగంలో రోజూ వేలాది మంది భక్తులు పాల్గొని తమ భక్తిశ్రద్ధలను చాటుతున్నారు.

# ఖాకీకే మాయని మచ్చ - రక్షణ అడిగితే దాడి ఎదురవుతుందా?

**ఎస్సై నుండి ఐపీఎస్ వరకు...**

**అధికార కుర్చీని ఆయుధంగా మార్చుకుంటున్న కీచకులు..**




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్టు 01,(విజన్ ఆంధ్ర): "నాన్నా నేను పోలీస్ అవుతా" అని గర్వంగా చెప్పే ప్రతి ఆడపిల్ల కల ఇవాళ ప్రశ్నార్థకంగా మారింది. "ఆపద వస్తే 100 కు ఫోన్ చేయి" అని చెప్పే సమాజమే, ఇప్పుడు "పోలీస్ స్టేషన్ గడప దాటితే సురక్షితంగా ఉంటామా?" అని భయపడుతోంది. ఎందుకంటే రక్షణ ఇవ్వాల్సిన కుర్చీలోనే రాక్షసులు కూర్చున్నారు. గత కొన్ని రోజులుగా వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు పోలీస్ వ్యవస్థనే కాదు, మొత్తం సమాజాన్నే సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి.

**శిక్షణలోనే చట్టాన్ని తొక్కిన ట్రైనీ ఐపీఎస్..**

యువతకు ఆదర్శంగా ఉండాల్సిన ట్రైనీ ఐపీఎస్ మహిళలను వేధించడం, బెదిరించడం, అధికార దుర్వినియోగం పై ఆరోపణలు వచ్చాయి. "దేశాన్ని కాపాడతా" అని ప్రమాణం చేయాల్సిన వ్యక్తి, స్వార్థానికి బానిసై చివరకు రిమాండ్ లో జైలుకు వెళ్లాడు. శిక్షణ దశలోనే ఇలా ఉంటే, రేపు బాధ్యతలు చేతికి వస్తే ఏమవుతుంది అనే భయం ప్రతి ఒక్కరిలో ఉంది.



**పెళ్లి పేరుతో మోసం చేసిన ఎస్సై**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సోషల్ మీడియాలో హైదరాబాద్ యువతికి పరిచయమై "పెళ్లి చేసుకుంటా" అని నమ్మించి లైంగికంగా దాడి చేశాడన్న ఫిర్యాదు జగిత్యాల పోలీస్ స్టేషన్ లో నమోదైంది. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్ లో అతడిని అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. న్యాయం చేయాల్సిన కుర్చీలో కూర్చుని అదే చట్టాన్ని కాలరాశాడు.

**స్టేషన్ లోనే కానిస్టేబుల్ ను వేధించిన సీఐ**

ఇదే కోవలో మలక్ పేట్ సీఐ వ్యవహారం మరింత దారుణం. తన ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒక మహిళా కానిస్టేబుల్ ను "ఉద్యోగం తీసేస్తా" అంటూ రోజు రోజుకూ మానసికంగా, శారీరకంగా వేధించాడు. చాలదన్నట్టు మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రహస్యంగా రెండో పెళ్లి చేసి చట్టాన్ని ఎగతాళి చేశాడు. బాధితురాలు ప్రాణాలకు తెగించి ఫిర్యాదు చేసిన తర్వాత సీపీ సజ్జనార్ సస్పెండ్ చేశారు. కానీ జరిగిన గాయానికి, కోల్పోయిన గౌరవానికి సమాధానం ఎవరిస్తారు? ఎస్సై,సీఐ,ఐపిఎస్ ... హోదాలు వేరు. కానీ చేస్తున్న పని ఒకటే. అధికారాన్ని ఆయుధంగా మార్చుకుని మహిళలను టార్గెట్ చేయడం.



**ఇది పోలీస్ శాఖకే పరిమితం కాదు**

ఈ రోజు తెలంగాణలోని ప్రతి మండల ఆఫీసు, ప్రతి కార్పొరేట్ కంపెనీ, ప్రతి స్కూల్, ప్రతి హాస్పిటల్ లో ఇదే పరిస్థితి. పై అధికారి అంటే భయంతో కింద పనిచేసే మహిళ నోరు మూసుకుంటోంది. "పని సరిగా చేయట్లేదు అని రిపోర్ట్ ఇస్తా", "ప్రమోషన్ కావాలంటే రాత్రి ఒంటరిగా ఉండు", "ఇంట్లో చెప్తా పరువు తీస్తా" ఇలాంటి బెదిరింపులు ప్రతి రోజు వేలాది మంది మహిళలు భరిస్తున్నారు. చట్టం ఉంది,ాూాాు కమిటీ ఉంది, మహిళా కమిషన్ ఉంది. కానీ ఫిర్యాదు చేస్తే "ఆమె క్యారెక్టర్ అలాంటిదే" అనే ముద్ర పడుతుందనే భయంతో చాలామంది రోదిస్తూనే ఉద్యోగం చేస్తున్నారు.

**అసలు మహిళ ఎవరిని నమ్మాలి?**

ఇంట్లో తండ్రి రక్షణ, రోడ్డుపై పోలీస్ రక్షణ, ఆఫీసులో బాస్ రక్షణ. ఈ మూడు స్థంభాలు కూలిపోతే ఆమె ఎక్కడికి వెళ్తుంది? రక్షించాల్సిన చేయే కత్తి పట్టుకుంటే ఈ సమాజం ఏమైపోవాలి?

**ఇప్పటికైనా మారాలి**

మహిళలు భయపడొద్దు. 181 మహిళా హెల్ప్ లైన్, షీ టీమ్, ప్రతి ఆఫీసులో ఐసీసీ ఉన్నాయి. మౌనంగా ఉంటే సమస్య పెరుగుతుంది తప్ప ఆగదు. అధికారంలో ఉన్న ప్రతి పురుషుడు గుర్తుంచుకోవాలి. మీ కింద పనిచేసే ఆమెకు కూడా ఇంట్లో తండ్రి, అన్న ఉన్నారు. ఈ రోజు మీరు చేసే తప్పు రేపు మీ ఇంటి ఆడబిడ్డకు జరగొచ్చు. అధికారం అంటే సేవ, వేటాడడం కాదు.



**ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇకనైనా కఠినంగా ఉండాలి.**

"విచారణ జరుగుతోంది" అంటూ ఫైళ్లలో పెట్టి కేసులను చంపొద్దు. తప్పు చేసిన 24 గంటల్లో సస్పెన్షన్, 7 రోజుల్లో ఛార్జ్ షీట్, బహిరంగ శిక్ష ఉండాలి. ట్రైనీ ఐపీఎస్ అయినా,ఎస్సై అయినా,సీఐ అయినా చట్టం ముందు అందరూ సమానమే అని నిరూపించాలి. పోలీస్ శాఖలో 90% మంది నిజాయితీగా పనిచేస్తున్నారు. వారి పరువు కోసమైనా కొందరు నీచులను వెంటనే బయటకు పంపాలి.

యువత కూడా ఐపీఎస్, ఎస్సై కావడం గొప్ప కాదు...

"నా సర్వీసులో ఏ ఒక్క మహిళ కన్నీరుకు నేను కారణం కాలేదు" అని ఛాతి ఉబ్బించి చెప్పుకోగలిగితేనే అది నిజమైన గౌరవం.

**చివరి మాట:**

ఖాకీ అంటే కామానికి లైసెన్స్ కాదు. అది ప్రజలకు ఇచ్చిన మాట. ఆ మాటను నిలబెట్టుకోలేని ప్రతి ఒక్కరూ ఈ రాష్ట్రానికి, ఈ సమాజానికి చేస్తున్న అతిపెద్ద ద్రోహం. రక్షణ ఇవ్వాల్సిన చేయి రక్తంతో తడిస్తే, ఆ సమాజం బతికే అర్హత కోల్పోతుంది. ఇంకా మనం మౌనంగా ఉంటామా?

# పిల్లలకు పాఠాలతో పాటు నైతిక విలువలు నేర్పాలి

**చైల్డ్ ప్రొటెక్షన్పై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సులో జిల్లా సెషన్స్ జడ్జి బాల భాస్కర్ రావు**




కుత్బుల్లాపూర్, ఆగస్టు 1 (విజన్ ఆంధ్ర): విద్యార్థులకు అకాడమిక్ సిలబస్ బోధించడమే కాకుండా మంచి--చెడు గురించి అవగాహన కల్పిస్తూ నైతిక విలువలు పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ బాల భాస్కర్ రావు అన్నారు. జిల్లా కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన చైల్డ్ ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పాఠశాలల్లో ప్రతి ఉపాధ్యాయుడు పిల్లల రక్షకుడిగా వ్యవహరించాలని, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. పిల్లలపై వేధింపులు లేదా అసభ్యకర ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఘటనలను దాచిపెట్టే ప్రయత్నాలు చట్టరీత్యా నేరమవుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ బాలల రక్షణ చట్టాలపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన అవసరమని, నిపుణులు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లోని ఇతర ఉపాధ్యాయులకు కూడా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య, కూషాయిగూడ ఏసీపీ చక్రపాణి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.